

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024



'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం 6,919 క్యూసెక్కులు ఉండగా సోమవారానికి 9,165 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 69.805 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 1800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రెండు ఘటనలు కుంగదీశాయ్!

"రెండు ఘటనలు నన్ను ఎంతో బాధించాయి. ఒకటి పోలియో మహమ్మారితో నా రెండు కాళ్లు సచ్చుబడిపోయాయి. సంక కర్రల సాయంతో నా బాల్యం, యువ్వనం సాగింది. ఆ తర్వాత పదిహేనేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నా రెండు కాళ్లు దిబ్బతిన్నాయి. ఇక నడవలేనని డాక్టర్లు చెప్పేశారు. వాళ్లు అలా అనడంతో చాలా కుంగిపోయాను. ఆ తర్వాత కొన్నాళ్లకు తేరుకున్నా. వైకల్యం శరీరానికే కదా. మనసుకు కాదని గ్రహించి మూడు చక్రాల బండిపై తిరుగుతూ దివ్యాంగ, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట చేస్తున్నా'నని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. దివ్యాంగుల హక్కుల సాధనతోపాటు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని, తమ గ్రామ అభివృద్ధికి పోరాడి ఎన్నో పనులు సాధించుకున్నట్లు చెప్పారు. ఆయన చెప్పిన విశేషాలు...

- కానీ ఏనాడూ బాధపడలా
- వైకల్యం శరీరానికే మనసుకు కాదు..
- కాళ్లు చచ్చుబడ్డా నిరంతరం పోరుబాటే నాది
- దివ్యాంగులే కాదు.. పేదల కోసమూ పోరాడా
- సొంతూరు అభివృద్ధికి పరితపించా
- సామాజిక సేవ కూడా చేస్తున్నా
- 'ఆంధ్రజ్యోతి'తో దివ్యాంగ నేత వెంకట్రావు

6

నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం





మనుబోలు : కాగితాలపూరులో సుడిగాలికి దెబ్బతిన్న రేకుల ఇల్లు



బుచ్చిరెడ్డిపాళెం : కనిసిరిపాళెంలో కూలిన రేకుల ఇల్లు

ఉదయం ఎండ..
మధ్యాహ్నం వాన

- నెల్లూరులో వింత వాతావరణం
- జిల్లాపై ఇంకా ఫెంగల్ ప్రభావం
- సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం
- కందుకూరులో పొంగిన వాగులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావం ఇంకా జిల్లాను వీడలేదు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు ప్రకాషించడంతో ఇక వాన రాదని జిల్లా ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది. అయితే, మధ్యాహ్నం తర్వాత వరుణుడు దంచి కొట్టడంతో రోడ్లపై వర్షపునీరు భారీగా ప్రవహించింది. నెల్లూరు నగరంతోపాటు గుడ్లూరు, లింగసముద్రం, సంగం ఉలవపాడు, బోగోలు, కావలి, కందుకూరు తదితర ప్రాంతాలలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తుపాన్ ప్రభావంతో మంగళవారం కూడా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కాగా, కందుకూరు ప్రాంతంలో వాగులు, వంకలు పొంగి ప్రవహించగా, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

● 33.8 మి.మీ వర్షపాతం

జిల్లాలో సోమవారం 33.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుడ్లూరులో 122.2, అత్యల్పంగా వెంకటాచ లంలో 7.4 మి.మీ వర్షం కురిసింది. లింగసముద్రంలో 90.2, వలేటివారిపాళెంలో 80, బోగోలులో 77.6, ఉలవపాడులో 86.4, కావలిలో 51.2, నెల్లూరు రూరల్ లో 14.4, నెల్లూరు అర్బన్‌లో 14.4 మి.మీ వర్షం పడింది.

● నీటమునిగిన నారుమళ్లు

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుబల్లి, కాశయకాగొల్లు, దామరమడుగు, మినగల్లు, పంచేడు, రేబాల

- మిగతా 6లో..



నెల్లూరు శివార్లలోని పెన్నా నదిలో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ




కందుకూరు : మోపాడులో నీటమునిగిన వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు



బుచ్చిరెడ్డిపాళెం : పశువుల కొట్టం కూసం కింద నలిగిన లేగదూడ

మరో భారం!

- జగన్ పాపం.. ప్రజలకు శాపం
- ఈసారి విద్యుత్ బాదుడు రూ.1000 కోట్లు
- యూనిట్‌పై రూ.1.10 పైసల అదనపు వసూలు
- మొన్నటి భారం నెలకు రూ.23 కోట్లు.
- ఈ నెల నుంచి పడే భారం రూ.21.54 కోట్లు
- రెండేళ్ల కాలానికి రూ.1000 కోట్ల భారం



నెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరునెలలు దాటుతున్నా గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పాపం తాలుకూ శాపం జిల్లా ప్రజలను వదలడం లేదు. జగన్ మోహన్‌రెడ్డి గద్దె దిగినా కరెంటు బిల్లులు షాక్ కొట్టడం ఆగడం లేదు. ప్రభుత్వం మారింది, కరెంటు బిల్లుల బాదుడు తప్పిపోయింది అనుకున్న ప్రజలకు మరో రెండేళ్లపాటు సర్దుబాటు చార్జీల పోటు తప్పేలా కనిపించడం లేదు. గౌతం ఆదానీ జగన్‌ల మధ్య కుదిరిన అక్రమ ఒప్పందం ద్వారా జగన్‌కు రూ.1750 కోట్ల ముడుపులు ముట్టాయని అమెరికా దర్యాప్తు సంస్థల ప్రకటించడంతో షాక్‌కు గురైన ప్రజలు తేరుకోకముందే ఈనెల నుంచి కరెంటు చార్జీల ధరలు మళ్లీ పెరగనున్నాయన్న సమాచారంతో షాక్‌కు గురయ్యారు.

● నిన్న...

జిల్లాలో గృహ విద్యుత్ సర్వీసులు (ఎల్‌టీ)11,94,474 ఉన్నాయి. ఈ సర్వీసుల కింద నెల వినియోగం సగటున 195 మిలియన్ యూనిట్లు. అంటే 19 కోట్ల 50 లక్షల యూనిట్లు. గత ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు ఎడాపెడా విద్యుత్ కొనుగోలు చేసిన కారణంగా ఆ భారం వినియోగదారులపై సర్దుబాటు చార్జీల రూపంలో పడుతోంది. రెండు నెలలకు ముందు సర్దుబాటు చార్జీల రూపంలో యూనిట్‌పై రూ. 1.21 పైసలు చొప్పున జిల్లా వినియోగదారులపై నెలకు రూ. 23.6 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని నవంబరు నుంచి అమలు చేశారు. డిసెంబరులో చెల్లించే బిల్లులో ఈ సర్దుబాటు చార్జీలు కలిసి ఉంటాయి.

● రేపు...

ప్రజలు ఈ భారాన్నే భరించలేకపోతుంటే తాజాగా డిసెంబరు నెల బిల్లు నుంచి (అంటే జనవరిలో చెల్లించే బిల్లు) మరో సర్దుబాటు చార్జీల పేరుతో యూనిట్‌పై మరో రూ.1.10 భారం పడనుంది. అంటే నెలకు ఖర్చు చేసే 19.50 కోట్ల యూనిట్లపై సర్దుబాటు చార్జీల పేరుతో చెల్లించాల్సిన మొత్తం నెలకు 21.54 కోట్ల రూపాయలు.

● జగన్ పాపం ఖరీదు

నవంబరు నుంచి అమలులోకి వచ్చిన సర్దుబాటు చార్జీలు, డిసెంబరు నుంచి అమలులోకి రాబోయే సర్దుబాటు చార్జీలను కలుపుకుంటే యూనిట్‌పై రూ.2.31 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు సర్దుబాటు చార్జీల రూపంలో జిల్లా ప్రజలు నెలకు సుమారు రూ. 45 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒకటో, రెండో నెలలతో ఈ పీడ విరగడై పోతుందా..? అంటే అదేం కుదరదు. 2026 డిసెంబరు వరకు ఈ పోటు భరించాల్సిందే. నెలకు రూ. 45 కోట్లు చొప్పున 24 నెలల కాలానికి జిల్లా ప్రజలు చెల్లించాల్సిన మొత్తం అక్షరాల రూ. వెయ్యి(1000) కోట్లకు పై మాటే. 2019 ఎన్నికల్లో జగన్ కూటమికి పదికి పది సీట్లను కట్టబెట్టిన నెల్లూరు జిల్లా ప్రజలకు ఐదేళ్ల పాలనలో కరెంటు చార్జీల రూపంలో జగన్ ఇచ్చిన రిటన్ గిఫ్ట్ ఖరీదు రూ.1000 కోట్లు అన్నమాట.!!

జనసైన్యం
సారథి ఎవరు!?

- భర్తీకాని జిల్లా అధ్యక్ష పదవి
- అధికారంలో ఉన్నా దృష్టిపెట్టని పవన్

నెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోని మూడు రాజకీయ పార్టీల్లో జనసేనది రెండవ స్థానం. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇదివరకటి కన్నా ప్రజల్లో జనసేన పట్ల ఆకర్షణ, ఆసక్తి పెరిగింది. కానీ అభిమానాన్ని కూడగట్టుకొని పార్టీని బలోపేతం చేసే దిశగా మాత్రం ప్రయత్నాలు జరగడం లేదు. జనసేన పార్టీ ఆవిర్భవించి పదేళ్లు దాటుతున్నా నెల్లూరు జిల్లాలో మాత్రం ఆ పార్టీ వేళ్లూనుకోలేదు. అలాగని ఆ పార్టీకి ప్రజాభిమానం తక్కువగా ఉందా అనుకోవడానికి కూడా వీలులేదు. నెల్లూరు జిల్లాలో మెగా కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ప్రజారాజ్యం పార్టీ తరపున నెల్లూరు సిటీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలోనే పవన్ అభిమానులు ఉన్నారు. గత ఎన్నికల ప్రచారం నుంచి ప్రజల్లో పవన్ పట్ల ఆసక్తి పెరిగింది. ఉప ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన వ్యవహారశైలి సామాన్య ప్రజలతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులను,

- మిగతా 6లో..

సీఎం నిర్ణయంతోనైనా
'ధర'కొచ్చేనా!?

- ఎమ్మార్పీ అమలు చేయాల్సిందేనని చంద్రబాబు ఆదేశాలు
- దోలాయమానంలో వ్యాపారులు
- దుకాణాల్లో అన్ని బ్రాండ్లు లభ్యం
- దిగివస్తున్న బార్ల యాజమాన్యాలు
- ఎమ్మార్పీకేనంటూ బోర్డుల ఏర్పాటు

నెల్లూరు (క్రైం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మద్యంషాపుల్లో అధిక ధరకు మందు విక్రయాలపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మార్పీ కచ్చితంగా అమలు చేయాల్సిందేనంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. అధిక ధరకు మద్యం విక్రయిస్తున్న తొలిసారి పట్టుబడితే రూ.5 లక్షల అపరాధ రుసుము, రెండోసారి పట్టుబడితే ఆ సాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. అయితే, నిన్నటిదాకా ఎమ్మార్పీకన్నా అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారులకు ఇది మింగుడుపడటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు వైన్‌షాపులను అందుబాటులోకి తీసుకు వచ్చింది. జిల్లాలో 182 వైన్‌షాపులు ఏర్పాటు చేసి ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశించారు. కానీ వ్యాపారులెవరూ ఆ ఆదేశాలను పట్టించుకోలేదు. పైగా పెట్టిన పెట్టుబడి త్వరగా రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో ఎమ్మార్పీకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తూ బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ నాయకులు కూడా ఉండటం కొసమెరుపు. అయితే, తాజాగా ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ధరలు దిగి వస్తాయా!? అన్నది వేచి చూడాలి. మరోవైపు అన్ని బ్రాండ్లు వైన్‌షాపుల్లోనే లభ్యమవుతుండటంతో మందుబాబులు బార్‌లకు వెళ్లడం తగ్గించేశారు. దీంతో చేసేది లేక బార్ల యాజమాన్యం కూడా ఎమ్మార్పీకే మద్యం అమ్మే స్థాయికి వచ్చేశారు.

● గత ప్రభుత్వంలో దోపిడీ

వైసీపీ ప్రభుత్వంలో బార్లలో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్ల మద్యం అందుబాటులో లేకపోవడం, బార్లలో మాత్రం దొరుకుతుండటంతో మందుబాబులు అక్కడకే వెళ్లేవారు. దీన్ని ఆసరా చేసుకుని బార్ల యాజమాన్యం సిండికేట్‌గా మారి ఎమ్మార్పీపై రూ.70 నుంచి 150 వరకు పెంచారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వైన్‌షాపులు అందుబాటులోకి రావడం, ఎమ్మార్పీ పక్కాగా అమలు అవుతుండటంతో బార్లకు మందుబాబులు వెళ్లడం తగ్గించారు. దీంతో బార్ల యాజమాన్యం ఎమ్మార్పీపై ధర తగ్గించుకుంటూ వస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం కొన్ని బార్లలో మాత్రం పాత ధరలే ఉన్నా అనేక బార్లలో మాత్రం ఎమ్మార్పీపై రూ.20 నుంచి 80 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. కొన్ని బార్లలో అయితే ఇంకాస్త ముందుకు అడుగులు వేసి ఎమ్మార్పీకే మద్యం అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



మద్యం దుకాణం ముందు మందుబాబుల సందడి



నెల్లూరు నగరంలోని ఓ బారు ముందు ఏర్పాటు చేసిన ప్లెక్సీ



కందుకూరు : చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

పొంగిన వాగులు, వంకలు

● కందుకూరులో చెరువులకు జలకళ

● భారీ వర్షంతో పంటలకు అపారనష్టం

ఫెంగల్ ప్రభావంతో ఆదివారం రాత్రి కందుకూరు ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం కురిసిన వర్షంతో ఈ ప్రాంతంలోని మన్నేరు, పందివాగు, తూములేరులు ఉధృతంగా ప్రవహించగా లోతట్టుప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. ముదురు పొగతోటలకు, మినుము పైర్లకు అపారనష్టం జరుగుతుందని రైతులు అంటున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో ఆకు జిగురు కారిపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. మండలంలోని మన్నేరు, ఉప్పటేరు, పందివాగు, తూములేరులు పొంగి ప్రవహించటంతో కందుకూరు ప్రాంతంలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే మీడియం ఇరిగేషన్ చెరువులు నిండే దశకు చేరగా, కొన్ని చెరువులకు పూర్తి సామర్థ్యంతో నీరు చేరిం ది. రాళ్లపాడు రిజర్వాయరుకు మాత్రం పెద్దగా నీరు చేరలేదు. ఆదివారం సాయంత్రానికి 17 అడుగుల నీటిమట్టం ఉండగా, సోమవారానికి 5 అంగుళాల మేర నీటిమట్టం పెరిగింది.

- కందుకూరు (ఆంధ్రజ్యోతి)



పొగనాట్లను పరిశీలిస్తున్న అధికారులు, పండాకు తెగులు సోకిన మినుము పంట







వలేటివారిపాలెంలోని హౌసింగ్ కార్యాలయం ముందు, ఎమ్మార్సీ కార్యాలయం వద్ద వర్షపు నీరు

రెండు ఘటనలు కుంగదీశాయ్!

భగవంతుడు ఇచ్చిన వైకల్యానికి కుంగిపోకుండా మనసులో ఆ భావం తొలగిస్తే సకలాంగులకు తీసి పోకుండా సమాజసేవ చేయవచ్చని నిరూపిస్తున్నారు వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధానకార్యదర్శి మండవ వెంకట్రావు. తన రెండు కాళ్లు సచ్చుబడిపోయినా మూడుచక్రాల వాహనంపై తిరుగుతూ దివ్యాంగులు, పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో తన భావాలను వెంకట్రావు పంచుకున్నారు.

● కానీ ఏనాడూ బాధపడలా ● వైకల్యం శరీరానికే మనసుకు కాదు.. ● కాళ్లు సచ్చుబడ్డా నిరంతరం పోరుబాటే నాది

● 'ఆంధ్రజ్యోతి'తో దివ్యాంగ నేత వెంకట్రావు ● నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం



మంత్రి నారా లోకేష్‌తో మండవ వెంకట్రావు (ఫైల్)

కావలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం బసవన్నపాలెం నుంచి 60 ఏళ్ల కిందట వెంకటక్రిష్టయ్య, సుబ్బమ్మలు జిల్లాలోని కావలి మండలం చౌదరిపాలెంకు వలస వచ్చారు. ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ తన ముగ్గురు పిల్లల్ని పోషించుకుంటున్నారు. ముగ్గురిలో పెద్ద కుమారుడు అయిన వెంకట్రావు 6నెలల వయసులోనే పోలియో బారిన పడి కాళ్లు సచ్చుబడ్డాయి. సంక కర్రల సహాయంతో నడుస్తుండేవారు. అయితే, 15 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు గాయపడి పూర్తిగా నడవలేని స్థితికి చేరుకున్నారు. అప్పటి నుంచి మూడు చక్రాల వాహనంపై తిరుగుతూ దివ్యాంగులు, పేదప్రజలకు సేవలు అందిస్తున్నారు.

● ఎన్నో పోరాటాలతో..

చౌదరిపాలెంలో అంతర్గత రోడ్లు, గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు, వాగుపై చప్టా వంటి అభివృద్ధి పనులను వెంకట్రావు పోరాడి సాధించుకున్నారు. అలాగే గ్రామంలో మహిళలను పొదుపుగ్రూపులుగా ఏర్పాటు చేయటంలో కూడా ఆయన చొరవ చూపారు. ఆ తర్వాత అక్కడ నుంచి కావలిపట్టణ ముసునూరుకు కాపురం వచ్చి అక్కడ ప్రభుత్వ రాయితీతో సిమెంట్ బ్రిక్స్ ఇండస్ట్రీ పెట్టి పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతేకాదు.. అలా వచ్చే ఆదాయంతో దివ్యాంగుల కోసం వెచ్చిస్తున్నారు. దివ్యాంగుల ఆశ్రమం పెట్టి నాలుగేళ్లు నడిపారు. దివ్యాంగులంకు నివేశనస్థలాలు ఇప్పించాలని ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు వంటి ఎన్నో పోరాటాలు చేసి వారికి ముసునూరులో నివేశన స్థలాలు ఇప్పించారు. దివ్యాంగులకు ప్రతిఏటా ఆటలపోటీలు, వైద్యశిబిరాలు, దుస్తులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, దాతల సహకారంతో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, సంక కర్రలు వంటి పలు పరికరాలను అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న దివ్యాంగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. దివ్యాంగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల దృష్టికి కూడా తీసుకెళ్లి వారికోసం పోరాడారు. దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రస్తుత గ్రంథాలయ సంస్థల రాష్ట్ర చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మనసులో వికలాంగుడనే భావాన్ని తొలగిస్తే దివ్యాంగులు కూడా సమాజంలో ఎవరికీ తీసిపోరనేందుకు తానే నిదర్శనం అని వెంకట్రావు చెబుతున్నారు.

రేపటి నుంచి సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డిగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి కలిగిన యువతులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కోర్సుకు ఎంపికైన వారు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఉచితంగా శిక్షణ అందిస్తామని పేర్కొ న్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి 10వ తరగతి, ఆపై చదివిన వారు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 8639867407ను సంప్రదించాలని తెలిపారు.

ఫొటోగ్రఫీలో సూర్యప్రకాశ్‌కి బంగారు పతకం

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పిక్టోరియల్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో మండలంలోని మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే సూర్య ప్రకాశ్ రావుకు బంగారు పతకం అందుకున్నారు. ఆచార్య నాగార్జున వర్సిటీ, ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గత నెలలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయన విజేతగా నిలిచారు. ఈ క్రమంలో సోమవారం నాగార్జున వర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ కే రామమోహన్‌రావు చేతుల మీదుగా బంగారు పతకం, నగదు బహుమతి, స్వర్గీయ శ్రీమతి చిత్రాంగదశర్మ మెమోరియల్ అవార్డును సూర్యప్రకాశ్‌రావు అందుకున్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కే గంగాధర్, ఏఎన్‌యూ ఆర్ట్స్ కామర్స్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎం సురేష్, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ హెడ్ జే మధుబాబు, ఫొటో జర్నలిజం విభాగం చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ రామ్మోహన్ రావు నుంచి బంగారు పతకం అందుకుంటున్న హెచ్ఎం సూర్యప్రకాశరావు

జీవో నెం.73ని అమలు చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికుల కోసం గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 73ను అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికులు నిరసన వ్యక్తంచేసి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రబీసాగు కింద వరినాట్లు ప్రారంభమ య్యాయన్నారు. ఈ సమయంలో వ్యవసాయ కార్మికులకు సరైన కూలి అందేలా జీవో నెంబరు 73ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మస్తానయ్య, గండవరపు శ్రీనివాసులు, రఘురామయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జనవరి 20 నుంచి వీఎస్‌యూలో 'నీలి విప్లవం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీలో వచ్చే జనవరి 20, 21 తేదీల్లో నీలి విప్లవం (సముద్ర వ్యవస్థల)పై ప్రత్యేక అంతర్జాతీయ సమావేశం జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆవిష్కరించారు. సముద్ర వనరుల సరికొత్త వినియోగం, పర్యావరణ పరిరక్షణ, సముద్ర సంబంధిత రంగాల్లో ఆధునిక, సాంకేతికతలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, మెరైన్ విభాగాధిపతి హనుమారెడ్డి, వెంకటరాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం వాన

(5వ పేజీ తరువాయి)

తదితర గ్రామాల్లోని వరి నాట్లు, నారుమళ్లు నీటమునిగాయి. కొన్ని పంటకాలువల్లో పూడిక తీయకపోవడం, అధికారుల ముందుచూపు లేకపోవడంతోనే నీరంతా పొలాల్లోకి చేరిందని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో 2రోజులు వర్షాలు కురిస్తే భారీగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాలకు పలుచోట ఇళ్లు, గిరిజనుల గుడిసెలు కూలాయి. కనిసిరిపాళెంలోని నెల్లూరు నాగరాజుకు రేకుల ఇల్లు ఆదివారం కూలింది. రూ.3లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం వాపోతోంది. పెనుబల్లిలో పశువులకొట్టం కూలి మల్లికార్జునకు చెందిన లేగదూడ మృత్యువాతపడింది. కనిసిరిపాళెం, పెనుబల్లిలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యార్థుల అభివృద్ధికి వర్క్‌షాపులు దోహదం

వెంకటాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో విద్యార్థుల అభివృద్ధికి వర్క్‌షాపులు దోహదపడతాయని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. వీఎస్‌యూలో సోమవారం పరిశోధన, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఇన్క్యుబేషన్, ఉపాధిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహించడం వల్ల విద్యార్థులకు, పరిశోధకులకు ఉత్తేజాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, వంశీకృష్ణ, ఉదయ గౌరి శంకర్, పార్థసారధి, డాక్టర్ ఆర్ మధుమతి, సుజాఎస్ నాయర్, డాక్టర్ జే విజేత, డాక్టర్ సాయిస్రవంతి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ వై విజయ, డాక్టర్ చెంచురెడ్డి తదితరులున్నారు.

'జనసేన'కు సారథి ఎవరు?

(5వ పేజీ తరువాయి)

అభిమానులను ఆకట్టుకొంటోంది. ప్రజల్లో ఇంత ఆదరణ పెరుగుతున్నా, గత చరిత్ర ఆధారంగా చూస్తే బలమైన పట్టు ఉన్నా పార్టీ నిర్మాణం జరగకపోవడం పవన్ అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. పార్టీ ఆవిర్భావం జరిగిన చాలా ఏళ్ల తరువాత జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి నియామకం జరిగింది. మనుక్రాంత్‌రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొంతకాలం పనిచేశారు. ఈయనకు సమాంతరంగా కేతంరెడ్డి వినోద్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేశారు. పాదయాత్ర పేరుతో నగరంలోని గడప గడప తొక్కారు. అయినా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి మనుక్రాంత్‌రెడ్డికి దక్కింది. పార్టీ కోసం ఎంత కష్టపడినా తనకు గుర్తింపు లేదని వినోద్ పార్టీని వీడారు. ఎన్నికల చివర్లో విజయసాయిరెడ్డి ప్రభావానికి లోనై మనుక్రాంత్‌రెడ్డి వైసీపీలో చేరిపోయారు. ఈయన ఉన్నప్పుడు కూడా పార్టీ ఏకతాటిపై నడిచిన సందర్భాలు లేవు. పార్టీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తూనే ఉంది. ఎన్నికలు పూర్తయి, పార్టీ అధికారంలోకి వచ్చిన తరుణంలో పార్టీని బలోపేతం చేసుకోవడానికి గతానికన్నా మెరుగైన అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినా జన సేనాని జిల్లా పార్టీ అధ్యక్షుడు, పార్టీ నిర్మాణంపై దృష్టి సారించకపోవడం ఆ పార్టీ వర్గాల్లో తీవ్ర నిరాశ వ్యక్తం అవుతోంది.

జిల్లాలో కోళ్లకు అంటువ్యాధి

అమరావతి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదలకూరు మండలం చాటగొట్ల, కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామాల్లో కోళ్లకు ఎవిన్ ఇన్‌ఫ్లూయెంజా అనే అంటువ్యాధి వ్యాప్తి చెందిందని ప్రభుత్వం గుర్తించింది. జంతు వ్యాధుల నియంత్రణ చట్ట ప్రకారం ఈ రెండు గ్రామాలు కోళ్ల అంటువ్యాధుల గ్రామాలుగా ప్రభుత్వం డీనోటిఫై చేసింది. ఈ గ్రామాలకు చుట్టుపక్కల కిలోమీటరు దూరం వరకు నియంత్రిత ప్రాంతంగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రక్తం అందించి.. ఆదర్శంగా నిలిచి!

ఒక ఆలోచన మనిషి జీవితాన్నే మార్చేస్తుం ది. అవును ఇది నిజం. తన చిన్నప్పుడు సకాలంలో రక్తం అందక ఎంతోమంది చనిపోవడం ఆ యువకుడిలో సామాజిక స్పృహను మేల్కొలిపింది. సామాజిక మాధ్యంలో ఏర్పడిన 'లైఫ్‌లైన్ ఫౌండేషన్' ఇంతింతై వటుడింతై అన్నట్టుగా ఎదిగింది. నాలుగు రాష్ట్రాల్లో 32 వేల మంది సభ్యులతో ఎవరికి రక్తం కావాలన్నా వెంటనే అందించి ప్రాణాలు నిలబెడుతున్నారు తాకొండ నవీన్.

- కొండాపురం (ఆంధ్రజ్యోతి)



రక్తదానం చేస్తున్న తాటికొండ నవీన్ (ఫైల్)

● ఒకరితో మొదలై 32వేల మందితో ఫౌండేషన్

● నాలుగు రాష్ట్రాల్లో విస్తరించిన సేవలు

● అవార్డులు, పురస్కారాలు అందుకున్న నవీన్

ఆదర్శం

కొండాపురం మండలం సాయిపేటకు చెందిన తాటికొండ నవీన్ రైతు కుటుంబం పుట్టి ఎంబీఏ పూర్తి చేశారు. హైదరాబాదులోని ఒక ప్రైవేటు కంపెనీలో హెచ్‌ఆర్ విభాగంలో ఉద్యోగం సంపాదించారు. తన గ్రామం, చుట్టుపక్కల గ్రామాలలో రక్తం అందక ఎంతోమంది చికిత్స అందుతున్న సమయంలోనే మృత్యువాత పడటం నవీన్ కళ్లారా చూశారు. అటువంటి వారిని కాపాడాలనే లక్ష్యంతో కొందరు యువకులను కలుపుకొని (ఫేస్‌బుక్) ఒక గ్రూపును తయారుచేసి నెల్లూరు బ్లడ్‌బ్యాంక్‌గా నామకరణ చేశారు. నెల్లూరులో రక్తం అవసరమైన వారు తమ వివరాలను గ్రూపులో పోస్ట్ చేసిన వెంటనే ఆ ప్రాంతంలోని గ్రూపుసభ్యులకు సమాచారం అందిస్తారు. వారు వెంటనే స్పందించి బాధితుడి వద్దకేవెళ్లి స్వచ్ఛందంగా రక్తం ఇచ్చి ప్రాణాలను కాపాడుతున్నారు. దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు తన సేవలను అందించాలనే ఉద్దేశంతో నెల్లూరు బ్లడ్ బ్యాంకను 'లైఫ్‌లైన్ ఫౌండేషన్'గా మార్పు చేశారు.

● ఒక్కరితో మొదలై...

2015లో నవీన్‌తో మొదలైన సేవలు తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాలలో సుమారు 32 వేల మందితో లైఫ్‌లైన్ ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నాయి. గ్రూపులో ఎక్కువ మంది యువకులు, ఉద్యోగులు, విద్యార్థులే ఉన్నారు. ఇప్పటివరకు సుమారు 3,500 మందికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడినట్లు నవీన్ చెబుతున్నారు. తన తండ్రి రామ్మూర్తినాయుడు సలహాతో తొలిత తమ స్వగ్రామమైన సాయిపేటలో రక్తదాన శిబిరం నిర్వహించానని, ఆ తర్వాత ఎన్నో ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించినట్లు తెలిపారు.

● 45 పురస్కారాలు

లైఫ్‌లైన్ ఫౌండేషన్ ద్వారా తాటికొండ నవీన్ చేస్తున్న సేవలను గుర్తించిన పలు సంస్థలు ఇప్పటివరకు 45 అవార్డులు, పురస్కారాలు అందజేశాయి. 2016లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు అకాడమీ (హైదరాబాదు) వారు అవార్డును అందజేయగా, ఆ తర్వాత ఐక్రాస్ సంస్థ, 2017లో నెల్లూరు శివాజీ యూత్ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థలు సంయుక్తంగా ఛత్రపతి బహుమతిని అందించి సన్మానించాయి. ఆంధ్ర, తెలంగాణా ఎన్జీవోల నుంచి అవార్డు అందుకోవడమే గాక కరోనా సమయంలో చేసిన సేవలకు ఎన్నో స్వచ్ఛంద సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో దాదాపు 32 ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందుకున్నారు.



అవార్డు అందుకుంటూ..

మిత్రుల సహాయంతోనే..

ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేశాను. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో ఎందరో మిత్రులు 'లైఫ్‌టైం ఫౌండేషన్'లో సభ్యులుగా ఉన్నారు. వీరందరి సహకారంతోనే బాధితులను ఆదుకుంటున్నాము. రక్తం కావాల్సినవారు 9092490767 నెంబరుకు ఫోన్ చేసి చెబితే చాలు దాతలు అక్కడకు చేరిపోతారు.

- తాటికొండ నవీన్

అంతర్ జిల్లా రగ్బీ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా కర్నూలు జట్లు

● రన్నర్స్‌గా సత్యసాయి జిల్లా జట్లు ● నెల్లూరు బాలుర జట్టుకు తృతీయస్థానం

కావలిటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులోగల డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగిన సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాల,బాలికల జట్లు హాజరయ్యాయి. కర్నూలు జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా జట్టు, తృతీయ స్థానంలో నెల్లూరు జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్‌గా సత్యసాయి జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణాజిల్లా జట్టు నిలిచాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని విజేతలకు కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు తమ కళాశాల వేదికవడం సంతోషంగా ఉందన్నారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోనే రగ్బీ పోటీల నిర్వహణకు వెనుకాడతామని, అలాంటిది కావలిలోని డీబీఎస్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పీడీ మురళి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిదులు పాల్గొన్నారు.



తృతీయస్థానం సాధించిన జిల్లా బాలుర జట్టుకు కప్పు అందిస్తున్న దామిశెట్టి సుధీర్ నాయుడు



బురదలోనే బడికి!

పిల్లలు బడికి పోవాలంటే అర కిలోమీటరు దూరం బురదలో నడవాల్సిన దుస్థితి కలువాయి మండలం రాజుపాళెంలో నెలకొంది. రాజుపాళెం గ్రామానికి కిలోమీటరు దూరంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఉన్నాయి. గ్రామం నుంచి కాలనీలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షం పడితే రొచ్చురొచ్చుగా తయారై కాలనీ నుంచి బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. స్కూలు పిల్లలు ప్రతిరోజూ ఈ బురదలో నడుచుకుంటూ గ్రామంలోని పాఠశాలకు వెళ్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా మా కాలనీలకు రోడ్డు ఏర్పాటు చేయడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)



పగలే వెన్నెల...!

వలేటివారిపాలెం నాలుగో వార్డులో పది రోజుల నుంచి వీధిలైట్లు రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వందలాది యూనిట్ల విద్యుత్ వృథా అవుతోంది. ఈ బిల్లు భారం పంచాయతీపై పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

అర్జీలు ఇవ్వాలంటే అడుసు తొక్కాల్సిందే..!

నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి తహసీల్దారు కార్యాలయ ఆవరణం వర్షాలకు బురదమయంగా మారింది. పలు పనులపై వచ్చే ప్రజలు అందులోనే రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు ఉన్నాయి. వివిధ పనుల నిమిత్తం నిత్యం ప్రజలు, మండలస్థాయి అధికారులు ఆ బురదలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు (crime news)

అసభ్యకర ప్రవర్తనపై పోక్సో కేసు నమోదు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి పట్టణంలో ఆదివారం ఓ బాలిక దుకాణం వద్ద ఐస్‌క్రీం కొనుగోలు చేసి ఇంటికెళుతున్న సమయంలో మరో దుకాణం వద్ద కూర్చొని ఉన్న ఎస్ లక్ష్మీనారాయణ అనే వ్యక్తి దగ్గరకు పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక రోధిస్తూ ఇంటికెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే తండ్రి బాలికను వెంటబెట్టు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆయ న ఫిర్యాదు మేరకు బాలికను విచారించి లక్ష్మీనారాయణపై పోక్సో కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కోవూరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) స్థానిక సాయిబాబ గుడి సమీపంలో జాతీయరహదారి ఫ్లైఓవర్ కింద సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నీలం రంగు జీన్స్ చొక్కా ధరించిన అతడ్ని స్థానికులు గుర్తించలేకపోయారు. సుమారు 50 ఏళ్ల వయసున్న అతను అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని స్థానికులు తెలిపారు. మృత దేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ బోల్తాపడి ఒకరికి గాయాలు

వెంకటాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బైక్ బోల్తాపడి ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొవూరుకు చెందిన సునీల్ పని నిమిత్తం బైక్‌పై మనుబోలుకు వెళ్లి తిరిగి కోవూరుకు వెళ్తుండగా చెముడుగుంట సమీపంలో గేదేలు ఒక్కసారిగా రహదారిపైకి రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో సునీల్‌కు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనచోదకులు సునీల్‌కు ప్రథమ చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ములుమూడి బస్టాండు సెంటర్‌లో వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ములుమూడి బస్టాండు కూడలి వద్ద ఒకే ప్రాంగణంలో స్వామి వివేకానంద విగ్రహం, ఆజాద్ స్థూపం ఉన్నాయి. ఆజాద్ స్థూపం చుట్టూ గోడ నిర్మాణానికి ఓ వర్గం వారు సోమవారం పనులు ప్రారంభించారు. మరో వర్గం వారు గోడ నిర్మించేందుకు వీలు లేదంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. సమాచారం అందుకున్న నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

ఏ నేరం చేశాడని దళితుడిని కొట్టారు?

- టీడీపీ ప్రభుత్వంలో కూడా వైసీపీ నేతల పెత్తనమా..
- దగదర్తి స్టేషన్ ఎదుట మాలేపాటి బైఠాయింపు



పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించిన మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) ఏ నేరం చేశాడని టీడీపీ కార్యకర్త, దళిత యువకుడు గొర్రిపాటి కార్తీక్‌ను ఎస్ఐ జంపాని కుమార్ అరెస్టు చేసి, దుర్భాషలాడి కొట్టారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ప్రశ్నించారు. దగదర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం ఆయన ఇరిగేషన్‌బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, దగదర్తి, తురిమెళ్ల, నారాయణపురం గ్రామస్థులతో కలిసి బైఠాయించారు. విషయం తెలుసుకున్న తిప్ప ఎస్ఐ భోజ్యా సిబ్బందితో అక్కడికి చేరుకుని మాలేపాటి సోదరులకు నచ్చచెప్పారు. దీంతో వారు అక్కడ నుంచి లేచి బయటకు వచ్చారు. అనంతరం మాలేపాటి సోదరులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాసమస్యలపై పోరాటం చేసినప్పుడు పలు తప్పుడు కేసులను పోలీసులు బనాయించారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో కూడా వైసీపీ నాయకులే పెత్తనం చెలాయిస్తున్నారని విరుచుకుపడ్డారు. పొలంలో కూలికి వెళ్లిన దళిత యువకుడు కార్తీక్‌ను దోషిగా చిత్రీకరించి తిప్ప పోలీసుస్టేషన్‌కు తరలించి అమానుషంగా కొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అంతే కాకుండా కులం పేరుతో దూషించారని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా, మండల అధికారుల దృష్టికి తీసుకుపోయినా ప్రయోజనం లేకపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే నియోజకవర్గ టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు, కార్యకర్తలు ఆవేదన చెందారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కావలి నియోజకవర్గంలోని సమస్యలపై చొరవ తీసుకోవాలని వారు కోరారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

బిట్రగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని అల్లూరు రోడ్డు - తలమంచి రైల్వేస్టేషన్ల మధ్య యువకుడి(30) మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. నెల్లూరు వైపు వెళ్లే మూడో లైన్ 192/16- 15 కిలోమీటర్ల వద్ద రైలు పట్టాల పక్కన మృతదేహం పడి ఉందని, మృతుడి వద్ద అశోకన్ శరన్‌రాజ్ అనే పేరుతో ఐడీ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విజయవాడ నుంచి తిరుపతికి వెళ్లే రైలు టిక్కెట్ లభించిందని ఆయన వివరించారు. అంతేకాక నవంబరు 11న జోలార్‌పేట నుంచి విజయవాడకు ప్రయాణించిన రైలు టిక్కెట్ కూడా ఉందని తెలిపారు. మృతుడు తెలుపు, గోధుమ రంగు గళ్ల డిజైన్ కలిగిన పొడుగు చేతుల చొక్కా, నల్ల జీన్స్‌ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జీఆర్పీ ఎస్ఐ రమాదేవి తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 94406 27648 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలియచేయాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7321
వెండి కిలో ధర	రూ. 90,800
వెండి ఒక గ్రాము	రూ.93.80

పొలం వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు

మర్రిపాడు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 2: నందవరంలో ఆదివారం పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. కొన్నేళ్లుగా ఇరువర్గాల మధ్య పొలం వివాదం కోర్టులో ఉంది. ఇటీవల శిల్ప అనే మహిళకు అనుకూలంగా తీర్పు రావడంతో భూమి సాగు చేసేందుకు యత్నిస్తుండగా మరో వర్గం ఎర్రమల్లు నాగస్వాతి అను వారు అడ్డుపడి తీవ్రంగా గాయపరచటంతో శిల్ప ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. తమపై దాడిచేశారని నాగస్వాతి కూడా ఫిర్యాదు ఇవ్వటంతో ఆదివారం సాయంత్రం ఇరు వర్గాల పై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి 212 మందివచ్చి అర్జీలు సమర్పించారు. వాటిని కలెక్టర్ తీసుకుని పరిశీలించి మాట్లాడుతూ 212 అర్జీలలో 95 అర్జీలు రెవెన్యూశాఖకు సంబంధించినవే వచ్చాయన్నారు. ప్రతిసారి ఎక్కువగా రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలే వస్తున్నాయని, వాటిని పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

● తుఫాన్ నష్టాల నివేదిక ఇవ్వండి

జిల్లాలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టాలను పూర్తి స్థాయిలో అంచనావేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో వర్షాల వలన దెబ్బతిన్న ఇళ్లు, పంట నష్టం, ధ్వంసమైన రోడ్లు తదితర వివరాలను శాఖల వారీగా నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలన్నారు. వర్షం ప్రభావంతో నష్టపోయిన బాధితులందరినీ ప్రభుత్వం తరపున ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాణ రక్షణ కోసం ఎస్పీకి విన్నవిస్తున్న హిజ్రాలు

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి

- పీజీఆర్ఎస్‌లో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా 78 మంది వచ్చి తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. వీటిపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

● మా ప్రాణాలకు రక్షణ కల్పించండి

తమ ప్రాణాలకు ముప్పు ఉన్నందున రక్షణ కల్పించాలంటూ హిజ్రాలు ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాసిని హత్యతో గతంలో ఎప్పుడు లేని విధంగా జిల్లాలో పరిస్థితులు మారిపోయాయని, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక అభద్రతా భావంతో హిజ్రాలు ఉన్నారన్నారు. ప్రత్యర్థి గ్రూపులతో ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించి ప్రశాంతంగా జీవించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలోని హిజ్రా కమ్యూనిటీతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

- బాలాజీనగర్‌కు చెందిన చందు రఘువర్ధన్ తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించి రూ.3 కోట్లు తీసుకొని మోసం చేశాడని, విచారించి న్యాయం చేయాలని నగరానికి చెందిన ఖాజామస్తాన్‌తో పాటు మరో ఏడుగురు ఎస్పీని కోరారు.
- వీఆర్సీ సెంటర్‌లోని ఓ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడికి తెలిసిన కిరణ్ అనే వ్యక్తి పలువురుకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి రూ.8 లక్షలు తీసుకొని మోసం చేసి పరారయ్యాడని పలువురు నిరుద్యోగులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని నాగ సుబ్బారెడ్డి, ప్రసాద్‌లు లారీ పని నిమిత్తం తన కుమారుడును నాలుగు నెలల క్రితం తీసుకెళ్లారని, ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదని ఓ వృద్ధురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

నుడా, ఎన్ఎంసీలలో అవినీతిపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఆనం వెంకటరమణారెడ్డి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నుడా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ అక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నుడాలో ఒక అధికారి అమెరికాలో లేవుట్ వేసినా, తిరుపతి జిల్లాలో లేఅవుట్ వేసినా అనుమతి ఇస్తారని ఆరోపించారు. మార్టిగేజ్‌ల రిలీజ్ అవినీతి అంతా ఇంతా కాదన్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(నుడా)లో అపార్టుమెంట్లకు, భవనాలకు నిబంధనలు తుంగలో తొక్కి భారీగా డబ్బులు తీసుకుని అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. మార్టిగేజ్ స్కాంను బయటపెట్టానని, దీనిపై హైకోర్టులో కూడా కేసు జరుగుతోందన్నారు. అయినా అధికారులు ఏమాత్రం భయం లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. బిల్డర్‌లతో కుమ్మక్కై నుడా, కార్పొరేషన్ అధికారులు మంత్రి నారాయణకు, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజకు చెడ్డపేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వారి ఆటలు ఇక సాగనివ్వమన్నారు. చిల్లకూరు తిరుపతి జిల్లాలో ఉంటే అక్కడి లేఅవుట్‌కు నుడాలోని ఒక అవినీతి అధికారి అనుమతి ఇవ్వడం విడ్డూరంగా ఉదన్నారు. డబ్బులిస్తే ఇంటికి తెచ్చి అనుమతి పత్రాలు అందచేసే పరిస్థితి వాటిలో ఉందన్నారు. అవినీతికి పాల్పడుతున్న నుడా, కార్పొరేషన్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- విమానాశ్రయం నిర్మాణం కోసం తీసుకున్న తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ దామవరం ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దామవరంలో సర్వే నుంబరు 238 నుంచి 259 వరకు ఉన్న భూములకు సంబంధించి తమకు పరిహారం చెల్లించాలని కోరారు.
- నివాస ప్రాంతాలపై అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ తొలగించాలని కోరుతూ నగరంలోని నవాబపేట లక్ష్మీపురానికి చెందిన ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్రమ విద్యుత్ లైన్లను మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్రాంత వాసులు మల్లికార్జున రావు, దుర్గాభవాని, కొమ్మి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రి ఎదురుగా ఉన్న వెలమసంఘంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వెలమసంఘంలో నరేష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన భార్య గర్భవతి కావడంతో పక్కవీధిలో ఉంటున్న పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో గత నెల 23వ తేదీన నరేష్ ఇంటికి తాళం వేసి భార్య వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని ఒకటిన్నర సవర బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు బాధితుడు సోమవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి(40) అనారోగ్యంతో గత నెల 8వ తేదీన జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం వైద్యశాల గేటు వద్ద మృతి చెందాడు. ఈ మేరకు వైద్యశాల సిబ్బంది దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణదారుడి నుంచి నా పొలాన్ని విడిపించండి

- నెల్లూరు కలెక్టరేట్ ఎదుట వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన హైమావతితో మాట్లాడుతున్న పోలీసులు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆక్రమణదారుడి నుంచి తన పొలాన్ని విడిపించాలని కోరుతూ నెల్లూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఓ వృద్ధురాలు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అక్కడే ఉన్న పోలీసులు, కలెక్టరేట్ సిబ్బంది అప్రమత్తమై ఆమెను అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. బాధిత మహిళ కథనం మేరకు.. మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన హైమావతికి పొల్లేలు కాలువ వద్ద 3.31 ఎకరాల పొలం ఉంది. అయితే, ఈమె పొలం పక్కనే ఉన్న ప్రభాకర్ అనే వ్యక్తి హైమావతి (68) పొలాన్ని ఆక్రమించి, సాగు చేస్తున్నా డు. ఇదేమని ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరిస్తున్నాడని హైమావతి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని తహసీల్దారుకు తెలిపినా ప్రయోజనం లేకపోవటంతో గత సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చినా అధికారులెవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో ఆత్మహత్యకు ప్రయత్నిం చినట్లు హైమావతి ఆవేదన వ్యక్తం చేసింది. తన పొలాన్ని విడిపించి, ఆక్రమణదారుడు ప్రభా కర్‌పై చర్యలు తీసుకోవాలని వేడుకుంది. అనంతరం ఆమెను ప్రజావిజ్ఞప్తుల దినం జరుగుతున్న తిక్కనభవన్‌లోకి అధికారులు తీసుకెళ్లారు. న్యాయం చేస్తామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో ఆమె శాంతించారు.

జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నియామకం

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సోమవారం నియమించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జీజీహెచ్ కమిటీకి కొన్ని పేర్లను కలెక్టర్ ఆమోదం కోసం పంపారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఈ కమిటీ ఎంపిక జరిగింది. గత ప్రభుత్వంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఉండగా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కమిటీ రద్దయింది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో నియామకాలు చేపట్టారు. మొత్తం ఐదుగురున్న కమిటీలో సభ్యులుగా వీరబ్రహ్మారెడ్డి, మడపర్తి శ్రీనివాసులు, అబిదాసుల్తానా, మొగరాల సురేష్, దారా మల్లికార్జున ఎంపికయ్యారు. వీరిలో కో ఆర్డినేటర్‌గా ఎవరిని ఎంపిక చేస్తారోనన్న చర్చ జరుగుతోంది. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీ రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధి, లోటుపాట్లపై చర్యలు తీసుకుంటుంది.

వితంతువులకు అండగా..

- ఇంటి యజమాని మరణిస్తే వెంటనే పింఛను
- పేద, బడుగువర్గాలకు ఆర్థిక భరోసా
- రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వులు



చేజర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వితంతువులకు ఆర్థిక అండగా ఉండాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇంటి యజమాని మరణిస్తే మరుసటి నెలలోనే వారి కుటుంబసభ్యులకు పింఛను మంజూరు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరిగా వితంతువులు నెలల తరబడి ఎదురుచూపులు చూడకుండా త్వరితగతిన పింఛను నగదును అందజేయాలని నిర్ణయించింది.

● తక్షణమే పింఛను

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులు మొత్తం 3,09,997మంది ఉండగా, వీరిలో 73,726మంది వితంతువులు ఉన్నారు. వీరికి సగటున రూ.29 కోట్లకుపైగా నగదు పంపిణీ చేస్తున్నారు. ఒక ఇంటిలో కుటుంబ యజమాని ఆ నెలలో 15వ తేదీలోపు చనిపోతే, జీవిత భాగస్వామికి మరుసటి నెల ఒకటోతేదీన పింఛను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ 15 నుంచి 30వ తేదీలోపు మరణిస్తే ఒక నెల ఆలస్యంగా ఇవ్వడానికి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించింది. వితంతువు ఆధార్, భర్త మరణ ధ్రువీకరణపత్రం, ఆదాయ, కులధ్రువీకరణపత్రాలతోపాటు దరఖాస్తు అందించాల్సి ఉంటుంది. ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అధికారులు పరిశీలన చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

● పాత పద్ధతిలోనే..

గత టీడీపీ పాలనలో ఇదే విధానం అమలులో ఉండటంతో వితంతువులు పింఛను కోసం నిరీక్షించే పరిస్థితి ఉండేది కాదు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఊరట లభించేది.

గత వైసీపీ ప్రభుత్వం ఈ పద్ధతికి స్వస్తి పలికింది. ఇంటి యజమాని ఏదైనా కారణంతో మరణిస్తే వితంతు కోటాలో పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఆ తర్వాత నాలుగు నెలల నుంచి ఆరు నెలలకుపైగా ఎదురు చూడాల్సి వచ్చేది. పైగా అధికార పార్టీ నాయకుల ద్వారా సిఫారసు చేసిన వారికే పింఛను మంజూరయ్యేది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద,మధ్యతరగతి వర్గాలకు భరోసా లభించింది. బాధితులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పనిలేదు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నుంచి అందిన ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక ప్రక్రియను చేపడతారు. నెలలోపే వితంతువుకు పింఛను అందనుండడంతో వారికి ఆర్థిక భరోసా కల్పించినట్లు అవుతుంది.

బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదు

● ఎమ్మెల్యే ఇంటూరి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): విధి నిర్వహణలో ఉద్యో గులు, సిబ్బంది బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చ రించారు. కూనిపాలెం పంచాయతీ కార్యదర్శి స్టాలిన్ సమీక్షకు ఆలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నరేంద్రదేవ్ ఆధ్వర్యంలో సోమవారం మండలాధికారులతో సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు, మండల గ్రాంటు మంజూరయినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గ్రామస్థాయిలోని పాలకులను సమన్వయం చేసుకొని, అధికారులు అభివృద్ధి వైపు అడుగులు వేయాలని తెలిపారు.కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యేకు ఎంపీడీవో, ఈవోఆర్డీ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, వైద్యాధికారిణి మణిదీపిక తదితరులు పాల్గొన్నారు.

నష్ట నివారణ చర్యలు చేపట్టండి

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తక్షణం నష్ట నివా రణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికా రులు, కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. మండల వ్యవసాయా .ధికారి వీ రాము ఆధ్వర్యంలో కేవీకే శాస్త్రవేత్త ఈ. వెంకటేష్ తదితరులు సోమవారం మండలంలోని ఓగూరు, మహదేవపురం, పలు కూరు, మోపాడు గ్రామాల్లో పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలో అధిక తేమ, చల్లని వాతావరణం కారణంగా మినుముకు బూడిద తెగులు సోకకుండా లీటరు నీటికి గ్రాము మైక్రోబుటానిల్, తెల్లదోమ సోకకుండా అసెటమీ ప్రైడ్ 0.2 గ్రాములు, 5 మి. లీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే అగ్రోమిన్ మ్యాక్స్ 2.5 గ్రాములు, 19-19-19లు 5 గ్రాములు లీటరు నీటికి కలిపి వెంటవెంటనే పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. లేతపొగనాట్లు వేరుకుళ్లు సోకి దెబ్బతినకుండా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 2 గ్రాములు, ప్లాంటోమైసిన్ గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కలు వేరుభా గంలో పోయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పీ అనసూయ, వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్, షేక్ నజీర్, ఐ. బ్రహ్మణి, ఈ రమణయ్య, మాధవ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు నారుమళ్లు జాగ్రత్త

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): వర్షాలకు వరి నారుమళ్లు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికా రి లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండ లంలో 300 ఎకరాల్లో నారుమడులు వేశారని, 10 నుంచి 15 రోజుల వ్యవధిలో 920 ఎకరాల్లో వరినాట్లు వేశారన్నారు. ప్రస్తుత వర్షాలకు 120 ఎకరాల్లో వరిపైరు, 60 ఎకరాల్లో నారుమళ్ల నీటమునిగాయని తెలిపారు. వరి పైరు, నాట్లు వేసిన పైరు 21 రోజులలోపు ఉండటంతో మళ్లీ 80 శాతం రాయితీతో విత్తనాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. రెండు రోజుల్లో పొలాల్లో నిల్వ ఉన్న నీరు వెళ్లే పరిస్థితిని బట్టి రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. నీరు నిలిచిన పొలాల్లో ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని ఆమె తెలిపారు.

చౌకదుకాణం ఏర్పాటు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఉదయగిరి రూరల్, డిసెం బరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని బీసీ కాలనీ వాసులకు అనువుగా చౌకదుకాణం ఏర్పాటు చేయాలని ఆయా కాలనీ వాసు లు సోమవారం తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా కాలనీల్లో సుమారు 600 కుటుంబాలు జీవ నం సాగిస్తున్నాయన్నారు. గతంలో వాహనం ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేవారన్నారు. గత మూడు నెలలుగా వాహనం రాకపోవడంతో పనులు మానుకొని పట్టణంలో ఉన్న చౌక దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో రానుపోను ఆటోకు రూ.100 చెల్లించాల్సి రావడంతో కూలినాలి చేసుకొనేవారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కాలనీల వాసులకు అనువుగా చౌకదుకాణం ఏర్పాటుచేయాలని కోరారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ జర్నల్‌లో 'ప్రకాశం' ఆర్టికల్

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు, విద్యార్థులు సంయుక్తంగా రూపొందించిన సాంకేతిక విశ్లేషణ పత్రం ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ జర్నల్‌లో ప్రచురితం కావటం తమ కాలేజీ సమర్థతకు తార్కాణమని టెక్నికల్ డైరక్టర్ డాక్టరు కె. విజయ్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీ పరిశోధనా విభాగం డీన్ డాక్టరు లక్ష్మణరావు నేతృత్వంలో రూపొందించిన ఈ పత్రంలో ఈఈఈ విభాగం మీరావలి, విద్యార్థులు కే మౌనీషా,కేవెంకటేష్‌లు సహకరించారని కరస్పాండెంట్ రామయ్య తెలిపారు.

పింఛన్ పంపిణీ



పింఛన్ నగదు అందజేస్తున్న ఏఎన్‌ఎం యల్లేశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఉన్న ఓ మహిళకు సోమవారం మండలంలోని తిరుమలాపురం సచివాలయం ఏఎన్‌ఎం యల్లేశ్వరమ్మ పింఛన్ నగదు అందజేశారు. పంచాయతీలోని సుజాతనగర్ ఎస్టీ కాలనీకి చెందిన రాగిపాటి పోలమ్మ నివాసంలో లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఏఎన్‌ఎం నెల్లూరులోని వైద్యశాలకు వెళ్లి ఆమెకు పింఛన్ నగదు అందించారు.

వర్షంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాల జలమయం



కొండాపురం : భీమవరప్పాడులో నీట మునిగిన వరిపైరు



వీవీపాలెం : వర్షాలకు కూలిన పొగాకు బ్యారన్

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుడడంతో జనజీవనం స్తంభించింది. సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులన్నీ బురద మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షంతో పొగాకు, శనగ పంటలు సాగు చేసే రైతులకు, సాగులో ఉన్న అరుతడి పంటలకు కొంతమేలు చేకూరింది. అయితే ఆశించిన మేర వర్షాలు కురవడంలేదని రైతులు కొంతమేర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

కూలిన పొగాకు బ్యారన్

● వలేటివారిపాలెం: గ్రామానికి చెందిన రైతు మిత్తుకుళ్ల వెంగయ్యకు చెందిన పొగాకు బ్యారన్ కురుస్తున్న భారీవర్షాలకు ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. దీంతో సుమారు రూ. లక్షకు పైగానే ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు వెంగయ్య చెప్పారు. పొగాకుబోర్డు అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

కార్యాలయాల ముందు నిలిచిన వర్షపునీరు

భారీ వర్షాలకు వలేటివారిపాలెంలోని ఎమ్మార్సీ, హౌసింగ్ కార్యాలయాలు, హైస్కూల్, ఇతర కార్యాలయాల ముందు వర్షపునీరు నిలబడి, చెరువును తలపిస్తున్నాయి. దీంతో కార్యాలయాల్లోకి వెళ్లే అధికారులు, సిబ్బంది, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపునీరు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటమునిగిన వరినారుమళ్లు

● కొండాపురం : తుపాన్ ప్రభావంతో మండల పరిధిలో ఆదివారం రాత్రి 35.2 మి.మీ వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాలకు వరినాట్లు నీటమునిగాయి. వరి నాట్లను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మెట్ట పంటలకు ఈ వర్షం తీవ్ర నష్టాన్ని చేకూర్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అలుగు పారుతున్న చెరువులు

● లింగసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది.ఈ వర్షానికి మండలంలోని చినపవని, వీఆర్ కోట చెరువులు అలుగులు పారుతోంది. విశ్వనాధపురం చెరువుకు 90 శాతం మేర నీరు చేరింది.అయితే గతంలో కురిసిన వర్షానికి ఈ చెరువులకు ఓ మోస్తరుగా నీరు చెరువుగా రాత్రి కురిసిన వర్షానికి చెరువులు నిండి అలుగులు పారుతున్నాయని రైతులు చెప్పారు.అయితే మండలంలోని మిగిలిన లింగసముద్రం కొత్త, పాత చెరువులకు, పెదపవని, మొగిలిచెర్ల చెరువులకు పెద్దగా నీరు చేరలేదని రైతులు తెలిపారు.అయితే పెదపవని, లింగసముద్రం తదితర గ్రామాలలో కురిసిన వర్షాలకు రోడ్లపై వర్షపు నీరు ప్రవహించి రోడ్లపై నీరు నిలిచింది.

వర్షంతో వీధుల జలమయం

● సంగం : మండల కేంద్రమైన సంగంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కాలనీల్లో వీధులన్నీ జలమయమయ్యాయి. రహదారిపైకి వర్షపునీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

● అల్లూరు : కురుస్తున్న వర్షంతో రైతులు అల్లాడుతున్నారు. ఇప్పటికే మండలంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న క్రమంలో నాలుగు రోజులుగా వర్షాలు ముంచెత్తాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. లోతట్టు ప్రాంతాల రైతులు పోసుకున్న నార్లు దెబ్బతినడంతోపాటు పొలాల్లో నీరు బయటికి వెళ్లకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

● కలిగిరి : మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి విడతలుగా వర్షం కురుస్తూనే ఉండటంతో సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. ఈ వర్షంతో మినుము, పొగాకు పంటలకు మేలు చేకూరుతుందని రైతులు పేర్కొన్నారు.

●బిట్రగుంట : బోగోలు మండలంలో మూడురోజులపాటు కుండపోతగా వర్షం కురిసి ఆగింది. అయితే సోమవారం సాయంత్రం నుంచి వళ్లీ వర్షం కురుస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన గేదె

వరికుంటపాడు, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక రామాలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దాసరి రమణమ్మకు చెందిన గేదెలు రోజు మాదిరిగా మేత కోసం వెళ్లి తిరిగి ఓ గేదె ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె గాలింపు చేపట్టారు. చివరికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతిచెందిన గేదెను గమనించింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని వేడుకొంది.

ఏ సాగరం తహసీల్దారుగా సుభాషిణి

అనంతసాగరం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): సాగరం తహసీల్దారుగా సుభాషిణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో సుభాషిణిని బాధ్యతలు స్వీకరించారు.

చేజర్ల తహసీల్దారుగా మురళి బాధ్యతల స్వీకరణ

చేజర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చేజర్ల మండల నూతన తహసీల్దారుగా బి మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి



విజయకుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ఎన్ విజయకుమార్‌ను గుంటూరులో స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీవోలంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్, స్వచ్ఛ సేవా, ప్రకృతి వ్యవసాయం, అటవీ రక్షణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం విజయకుమార్‌ను సంస్థల ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛంద సేవాసంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య, కార్యదర్శి ప్రకాష్, సభ్యులు పీఎస్ మూర్తి, రాముడు, రాజారావు, సింహాద్రి, ప్రసాదం, తులసీ, నాగరాణి, రాధా తదితరులు పాల్గొన్నారు.

నేడు కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం

సీతారామపురం, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండల కేంద్రంలోని ఎస్‌వి కన్వెన్షన్ హాలులో ఈనెల 3వ తేదీన జరిగే ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో వీపీఆర్ ఫౌండేషన్ దారా దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ల పంపిణీచేయనున్నట్లు తెలిపారు. మండలంలోని కూటమి కార్యకర్తలందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో ఇంటి, కొళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. పురపాలక సంఘ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ అడ్మిన్, ఎనిమిటీస్ సెక్రటరీలు, రెవెన్యూ ఆఫీసర్ పణికుమార్‌లతో పన్నుల వసూళ్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా వివిధ పన్నుల డిమాండ్ ఎంత ఉంది.. ఇప్పటికి ఎంత వసూళ్లు చేశారని ప్రశ్నిఅరు. పురపాలక సంఘ నిర్వహణ దృష్ట్యా పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే కాకర్ల సంతాపం

వింజమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కండే రమణయ్య ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం టీడీపీ నాయ కుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రమణయ్య మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరికుంటపాడు, కనియంపాడు గ్రామాల బొగ్గుబట్టీల వద్ద పనిచేస్తున్న వలస కార్మికులకు సోమవారం మద్దినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే ఆంధ్రావారిపల్లి, తూర్పుబోయమడగల ఎస్టీ కాలనీల్లోని పేదలకు సైతం వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, నాయబ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దాడికి నిరసన

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ గూండాలు చేసిన దాడిని నిరసిస్తూ సోమవారం కందుకూరులో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ జోన్ కన్వీనర్ నేతి మహేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో జరిగిన నిరసనలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బీ. వెంకటేశ్వర్లు, బాషా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబరు 73ని అమలు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

అనంతసాగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 73ని అమలు చేయాలని సీపీఎం నాయ కులు డిమాండ్ చేశారు. ఈమేరకు అనంతసాగరం బస్టాండ్ సెంటర్ లో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు సుభాషిణికి వినతిపత్రం అందిచారు. కార్య క్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, మీరా మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

బిట్రగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పరిధి అక్కరాజువారికండ్రిక సమీపంలోని అటవీ, మేత పోరంబోకు భూములను కొందరు పెద్దలు ఆక్రమించుకుంటున్నారని, వాటిని తొలగించి గ్రామస్థులకు న్యాయం చేయాలని పసుపులేటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దారు సురేష్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. ఈ విషయమై గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల బాలక్రిష్ణ, గుర్రం వెంకటేశ్వర్లు, బొద్దులూరి వెంకటేశ్వర్లు, పసుపులేటి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మంచినీటి ట్యాంకులు

● ట్యాంకుల నుంచి పైపులకు విడుదల కాని నీరు ● గ్రామస్థుల ఇక్కట్లు



నిర్మాణం పూర్తయిన ట్యాంకు

లింగసముద్రం, డిసెంబరు 2: మండలంలోని పలు గ్రామాలలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ పథకం కింద మండలంలోని కొత్త మాలకొండరాయునిపాలెం, ముక్తేశ్వరం, శింగరపాలెం, నారసింహాపురం, ఎర్రారెడ్డిపాలెం, లింగసముద్రంలో మంచినీటి ట్యాంకులు నిర్మించారు. అయితే వీటి నిర్మాణాలు ఈఏడాది మే నెలలో పూర్తయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అన్ని పరీక్షలు పూర్తిచేశారు. ఇక ట్యాంకుల నుంచి పైపులకు నీరు వదలాల్సి ఉంది. కానీ ఈ ట్యాంకులను ఆయా గ్రామ పంచాయతీలకు గుత్తేదారులు అప్పగించలేదు. దీంతో పంచాయతీ వారు ఈ ట్యాంకుల వద్ద నీరు వదిలేందుకు పంపు మెకానిక్‌లను నియమించలేదు. ఈ కారణంగా ఈ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● సంగం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అశోక్



సంగం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి అశోక్ తెలిపారు.

? సాధారణంగా సీజనల్ వ్యాధులు దేనివల్ల వస్తాయి.

! తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ ఫీవర్ వస్తాయి. ఇవి రాకుండా వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

ఈ ముఖాముఖి

? సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యఆరోగ్య శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుంది.

! పరిసరాలు, డ్రైనేజీలు, మురికిగుంటలు, నిల్వ నీటిలో లార్వా చేరకుండా వైద్యఆరోగ్య సిబ్బంది ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలతో పంచాయతీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నాం. అలాగే దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? స్థానిక పీహెచ్‌సీలో ఓపీ ఎలా ఉంది. ఎలాంటి వ్యాధులతో ఎక్కువ మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా.

! ప్రతి నిత్యం 70 నుంచి 80 మంది వైద్యశాలకు అనారోగ్యంతో వస్తున్నారు. ఎక్కువగా జ్వరాలు, జలుబు, దగ్గుతో వస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

న్యూస్ బాక్స్

'మంద కృష్ణపై విమర్శలు తగవు'

కావలి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) మూడు దశాబ్దాలుగా మాదిగల ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న మంద కృష్ణ మాదిగను మహాసేన రాజేష్ విమర్శించటం తగదని ఆల్ ఇండియా బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంసన్ పేర్కొన్నారు. జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ మాదిగలను రాజేష్ చులకనగా మాట్లాడటాన్ని ఖండించారు. నీ స్థాయిమరిచి మంద కృష్ణ మాదిగను గురించి మాట్లాడే అర్హత నీకు లేదన్నారు. ఇకముందు మాట్లాడితే సహించేది లేదన్నారు. సమా వేశంలో బహు జన సంఘం జిల్లా కార్యదర్శి నల్లగట్ల జార్జి, పరుసు రమణయ్య పాల్గొన్నారు.

హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి

కందుకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంలో నరేంద్రమోదీ నేతృత్వంలో పెరిగిపోతున్న హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు ఐక్యంగా పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీ ప్రదీప్ పేర్కొన్నారు. కందుకూరులో సోమవారం జరిగిన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత రిజర్వేషన్లను నీరుగార్చేందుకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చారని, వీటి రద్దుకోసం ఐక్యంగా పోరాటం సాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సాదినేని వెంకటేశ్వరరావు, ఎల్. రాజశేఖర్, ఈ. భూషణం, జగన్, గేరా చిరంజీవి, బ్రహ్మయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, టి. పోతురాజు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ

కావలిటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వీఎస్‌యూ పీజీ కళాశాలలో బుధవారం నుంచి డేటా ఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బాలశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు ఎలాంటి ప్రవేశరుసుం ఉండదని, 3నెలలపాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 35 వయసుండి టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ 63015 43185 నెంబర్‌ను ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

బీసీ కాలనీలో అధ్వానంగా రోడ్డు



అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బీసీ కాలనీలోని సజ్జల కొండయ్య ఇంటి పక్కన ఉన్న రోడ్డు బురదమయమై అధ్వానంగా ఉంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసి మీరయ్య, మరికొందరు చెప్పారు. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు కమ్మేయడంతో రహదారంతా మూసుకొని పోయింది. వర్షం కురిసిన ప్రతిసారీ ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నట్టు వారు చెప్పారు.ఈ రోడ్డు అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

హెల్ప్‌లైన్ల ద్వారా అర్జీలు పంపవచ్చు : ఏడీసీ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ద్వారా వివిధ సమస్యల పరిష్కారం కోసం నగర వాసులు స్వయంగా అధికారులకు అర్జీలివ్వడంతో పాటు ఇంటి వద్ద నుంచే హెల్ప్‌లైన్లద్వారానూ వినతులు పంపవచ్చని ఏడీసీ నందన్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని వివిధ విభాగాధిపతులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు కార్పొరేషన్ హెల్ప్‌లైన్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వీటిని ఇప్పటికే సచివాలయాల ద్వారా ప్రజలకు చేరవేశామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షుణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వచ్చిన వినతి మరోసారి అధికారుల దృష్టికి రాకూడదని స్పష్టం చేశారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న ఏడీసీ నందన్

త్వరలో నగరవనం ప్రారంభం

● జిల్లా టెరిటోరియల్ డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

నెల్లూరు(వెంకటేశ్వరపురం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దాదాపు 100 హెక్టార్‌లలో నగర వనం రుపుదిద్దుకొంది. ఇప్పటికే సందర్శనకు ప్రజలకు అనుమతి ఇస్తున్నాం. పిల్లలు, పెద్దలు అందరూ కలసి రోజంతా ఎంతో ఆనందంగా గడపవచ్చు. ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. త్వరలోనే నగరవనం ప్రారంభించేలా కర్యాచరణ చేపడుతున్నామని జిల్లా టెరిటోరియల్ డీఎఫ్‌వో మహబూబ్‌బాషా తెలిపారు.



ఇంటర్వ్యూ

? నగరవనం ప్రవేశం టికెట్ ఎంత.

! నెల్లూరు నగర ప్రజల కోసం ప్రస్తుతానికి పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 పెట్టాం. అదే విధంగా సినిమా, ఫొటో షూట్‌లకు, ఫంక్షన్‌లకు ప్రత్యేక ధరలు ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు అటవీశాఖ అధికారులను సంప్రదించవచ్చు.

? జామాయిల్‌తో లాభం ఎంత. ఎన్ని హెక్టార్‌లకు టెండర్ పిలిచారు.

! జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా జామాయిల్ తోటలకు టన్ను ధర రూ.8100 పలికింది. ఈ అమ్మకాల ద్వారా అటవీశాఖకు దాదాపు రూ.82 కోట్లు ఆదాయం రానుంది. జిల్లాలోని ఐదు రేంజ్‌ల పరిధిలో దాదాపు 3500 హెక్టార్‌లలో జామాయిల్ తోటలకు టెండర్‌లు పిలిచాం. మొత్త 1,02,000 టన్నుల కర్ర వస్తాదని అంచనా వేశాం.

? జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు.

! జిల్లాలో పలు క్యాడర్‌లలో పోస్టులు ఖాళీ ఉన్నాయి. దాదాపు 102 పోస్టులు భర్తీ చేయలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే పోస్టుల భరీక్తి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది.

? ఎర్ర చందన అక్రమ రవాణా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారు.

! ఎర్ర చందనం స్మగ్లింగ్ నియంత్రణకు గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. చెక్ పోస్టుల ద్వారా నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. అటవీ సమీప ప్రాంతాల వారికి అవగాహన కార్య క్ర మాలు నిర్వహిస్తున్నాం.

16న సింహపురి యునైటెడ్ క్యారల్స్

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు జనన సందేశాన్ని పాట ల ద్వారా వివరించే సింహపురి యునైటెడ్ క్యారల్స్‌ను ఈనెల 16వ తేదీ నిర్వహించ నున్నట్లు సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ సంస్థ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద గల బాప్టిస్టు చర్చి డౌనీహాల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ సారి నగరంలోని అన్ని సంఘాలు కలిసి నిర్వహిస్తున్న యునై టెడ్ క్యారల్స్ 16న సాయంత్రం 6.30 గంట లకు ఏబీఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక ట్రాలీపై గాయక బృందం క్రిస్మస్ గీతాలను ఆలపిస్తూ నగర ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేస్తారని చెప్పారు. కన్వీనర్‌లు రెవరెం డ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ పీ.జోనీజోలు మాట్లాడుతూ ఏబీఎం కాంపౌండ్ నుంచి కనకమహల్ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్ మీదుగా కొండాయపాలెంగేటు, వేదాయపాలెం, డైకస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు ల మీదుగా బట్వాడిపాలెం సెంటర్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. ఈ సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ బిల్లీ శ్యాంసన్, సభ్యులు కె.విద్యాధర్, దినేష్, మహేష్, పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయ వాచ్‌మన్ మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయ వాచ్‌మన్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు .కృష్ణయ్య(55) రెండేళ్లుగా రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. అనారోగ్యంతో సోమవారం ఆయన కార్యాలయం వద్ద మృతి చెందారు. ఈ విషయాన్ని గమనించిన వీఆర్‌వో మధుసూదనరావు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి ఆధార్‌కార్డులో కృష్ణయ్య, సర్వేపల్లి కాలువకట్ట అని ఉంది. దీంతో పోలీసులు సర్వేపల్లి కాలువకట్ట పరిసర ఆప్రంతాల్లో ఆరాతీయగా వివరాలు తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసులకు తెలియజేయాలని పోలీసు అధికారులు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి : రూరల్ ఎమ్మెల్యే

● పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశంలో చేరిక



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాత, కొత్త నాయకులందరం సమష్టిగా టీడీపీని బలోపేతం చేద్దామని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో పెద్దచెరుకూరుకు చెందిన వైసీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, మురళీరెడ్డి, అనుదీప్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలతో పాటు మరికొందరు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరురూరల్లోని గ్రామాల్లో తమ పార్టీ నాయకులు వ్యతిరేకించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ టీడీపీలోకి తీసుకునేది లేదని స్పష్టం చేశారు. గతంలో నియోజవర్గంలో 18 గ్రామ పంచాయతీలు, 26 మున్సిపల్ డివిజన్లను కైవసం చేసుకున్నామని, అదేతంతు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

● **రహదారి ప్రారంభం**

రూరల్లోని కొత్తకాలువ కూడలి-కోడూరుపాడుల మధ్య రూ.4 కోట్లతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. 3వ మైలు నుంచి నారాయణరెడ్డిపేట వరకు రూ.9 కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం 23వ డివిజన్‌లో రూ.60 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు జానా నాగరాజు, దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్‌యాదవ్, జావీద్‌లు పాల్గొన్నారు.

● **రేపటి నుంచి 'గడప గడపకు గిరి'**

నెల్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈ నెల 4వ తేదీ నుంచి 'గడప గడపకు గిరిధర్‌రెడ్డి' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రూరల్ ఎమ్మెల్యే సోదరుడు, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాటు జరిగే ఈ కార్యక్రమం నగరంలోని 19వ డివిజన్ రామలింగాపురం నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతి శని, ఆదివారాలు ప్రజల ఇళ్లకు వెళ్లి కలుసుకుని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరిస్తామని తెలిపారు. ఎక్కడికక్కడ ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో శ్రీధర్‌రెడ్డి పోటీ చేయాలా లేక తాను పోటీ చేయాలా అన్నది అధిష్ఠానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

నారుమళ్లలో నీరు వెలికితీయాలి



ముత్తుకూరు : నారుమళ్లను పరిశీలిస్తున్న ఏడీఏ, శాస్త్రవేత్తలు



విడవలూరు : నీటి మునిగిన పొలాలకు పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా నాలుగురోజుల నుంచి మండలంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా వరి నారుమళ్లు, వరినాట్లు వేసిన పొలాలు నీట మునిగాయని, పొలంలో నుంచి వర్షపునీటిని తీసివేయాలని మండల వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదుసెంట్ల నారుమడికి కేజీ పొటాష్, ఐదుకేజీల యూరియా కలిపి చల్లుకోవాలని తెలిపారు. అలాగే క్లోరిఫైరిఫాస్ 50 ఈసీ 2ఎంఎల్, లీటరు నీటికి కలిపి, కార్బండ్ నిజం పౌడర్ రెండు గ్రాములు, లీ టర్ నీటికి కలిపి పిచికారీ చేసుకో వాలన్నారు. వరినాట్లు వేసిన పొలం లో ఎకరాకు 25 నుంచి 30 కేజీల యూరియా, 15కేజీల పొటాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇలా చేసుకోవడం వల్ల వరి నారు, వరినాట్లకు అధిక వర్షాలు వల్ల చీడపీడల బాధ ఉండదని పేర్కొన్నారు. పిచికారీ చేసుకోవాలన్నారు. ఇలా చేస్తే ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కృష్ణయ్య, ఉద్యానవన శాఖ అధికారి కే రెడ్డి ప్రసన్న, టీడీపీ నాయకులు చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

● **ముంపు పొలాల సందర్శన**

విడవలూరు,(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలోని రామతీ ర్థం, రామచంద్రాపురం పంచాయతీల్లో నీటి ము నిగిన వేరుశనగ, వరిపైర్లను సోమవారం వ్యవ సాయాధికారులు సుజాత, కేవీకే అధికారులు శివ జ్యోతి, ఓబయ్య పరిశీలించారు. ఈసందర్భంగా వ్యవసాయశాఖ ఏడీఏ మాట్లాడుతూ కురిసిన వర్షాలకు మండలంలో 225 ఎకరాల వరిపొలా లు, 74 ఎకరాల వేరుశనగ, 15ఎకరాల్లో నారుమ ళ్లు నీటి మునిగాయన్నారు. వరిపొలాల్లో ఉన్న నీటిని తీసివేసి ఎకరాకు 25కేజీల యూరియా, 15కేజీల ఎంవోపీలను వేయాలన్నారు. దీనివల్ల పైరు కోలుకుంటుందన్నారు. అలాగే వేరుశనగ పంటకి ఎకరాకు లీటరు నీటికి 15గ్రాముల కార్బండిజమ్‌ని

● **నీటమునిగిన వరినాట్ల పరిశీలన**

కోవూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు గ్రామ పొలిమేరల్లో నీటమునిగిన వరినాట్లను సోమవారం కేవీకే, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ లలితా శివజ్యోతి, డాక్టర్ ఓబయ్య, డాక్టర్ మధుసూదనరావు లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నీరు తీసిన వెంటనే యూరియా 15-20 కిలోలు, పొటాష్ 15కిలోలు ఎకరాకు వాడాలన్నారు. పొటాష్ వాడకం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. వారి వెంట వ్యవసాయాధికారి ఇందిరావతి, వీఏఏలు చైతన్య, మౌనిక ఉన్నారు.



మనుబోలు : నారుమళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దెబ్బతిన్న నారుమళ్ల పరిశీలన

ముత్తుకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపూడి, తాళ్లపూడి, బ్రహ్మదేవం గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న నారుమడులను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. పొలం నుంచి నీటిని తీసివేసే ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. పొలం నుంచి నీటిని తీసివేసిన తర్వాత చేపట్టాల్సిక చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీమాధవి, శాస్త్రవేత్తలు పరమశివం, శాస్త్రవేత్త కిరణ్, వ్యవసాయ అధికారి జోత్స్నా రాణి, వీఏఏ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘూరువారి కండ్రిగ, చిన్న చెరుకూరు గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న వరి నాట్లను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. వర్షాకాలంలో తీసుకో వాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించా రు. ఈ కార్యక్రమంలో వీఏలు సుమంత్, శివకుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● మనుబోలు(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో వర్షానికి నీటమునిగిన నారుమళ్ళను మండల వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కళారాణి తదితరు లు పాల్గొన్నారు.

● **నీటిని తొలగించాలి : ఏవో**

పొదలకూరు(ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాను ప్రభావంతో పంట పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వాసు రైతులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మినుము, పెసర సాగు చేస్తున్న రైతులు ముందుగా పొలంలో నిలిచిన నీటిని బయటకు తీసి పొగాకు లద్దెపురుగు, శనగ పచ్చపురుగు కనిపించినట్లయితే ఇమామెక్టిన్ బెంజోయేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో, ఇండాక్సీ కార్బ్ ఒక ఎమ్ఎల్ లీటరుకు కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

న్యూస్ బాక్స్

ఇరుకళల పరమేశ్వరి ఆలయ హుండీల లెక్కింపు

నెల్లూరు(సాంస్కృతికం) డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూలాపేట ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగింది. సెప్టెంబరు 10 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.6,30,430 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, కార్యనిర్వహణాధికారి వీ.గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులు, ముఖ్యఅర్చకులు పి.చంద్రశేఖర్ స్వామి, పరకామణి సేవా సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాహుకాల పూజలు

నగర గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో ప్రతి మంగళవారం సాయంత్రం 3గంటల నుంచి 4.30గంటల వరకు రాహుకాల పూజలు జరుగుతాయని ఆలయ ఈవో వి.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పిస్తామని తెలిపారు. భక్తులందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకాశదీపం నిమజ్జనం



స్వర్ణాలచెరువులో నిమజ్జనం చేసిన ఆకాశదీపం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ నగర్ శ్రీకృష్ణ మందిరంలో కార్తీక మాసం సందర్భంగా ఎగురవేసిన ఆకాశ దీపాన్ని సోమవారం ఇరుకళల పరమేశ్వరి ఘాట్‌లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘాట్ వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వర్ణాల చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అలాగే ఇదే ఘాట్‌లో ఉదయం సింహపురి కార్తీక లక్షదీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోలి స్వర్ణదీపాలను స్వర్ణాల చెరువులో వదిలి, పూజలు నిర్వహించారు.

మద్యం దుకాణాన్ని మార్చండి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాకర్స్ రోడ్డు పరమేశ్వరినగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపు తొలగించాలని గత 24 రోజులుగా నిరసన తెలుపుతున్న స్థానికులు సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ ఎక్సైజు సూపరింటెండెంట్‌కు ఆ మద్యం షాపును వేరే చోటుకి తరలించామని ఆదేశించారు. దీంతో నిరసనకారులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ నవీద్ అహ్మద్, సయ్యద్ సర్దార్, షకీల్, జేబేర్, సందానీబాషా, జాకీర్, ఫాజిల్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై దాడి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని డైకాస్‌రోడ్డు బస్‌స్టాప్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు సోమవారం దాడులు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఉమామహేష్‌ను అరెస్టు చేసి అతని నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ డీ శ్రీధర్, హెడ్‌కానిస్టేబుల్ పీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం ప్రత్యేక శిబిరం

మనుబోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కోసం సోమవారం ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ త్వరలోనే ఉపకరణాలు అందజేయనున్నట్లు సీఆర్‌సి ఫిజియోథెరపిస్టు రాకేష్, స్పెషల్ ఎడ్యుకేటర్ మల్లిఖార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి పాల్గొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణ అందరి బాధ్యత అని ప్రజా సైన్సు వేదిక నగర అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో జాతీయ పర్యావరణ దినోత్సవంలో ఆయన కాలుష్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాతీయ కాలుష్య దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చర్చ

రాపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం సచివాలయంలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాపూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ భూపతి జయమ్మ, ఉపసర్పంచ్ బత్తిన పట్టాభిరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మీ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ సబ్ స్టేషన్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, అధికారులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ బాలాజీ నగర్, ఏసీ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఇండోర్ సబ్ స్టేషన్‌కు వేపదొరువు, పద్మావతి నగర్‌లలో మున్సిపల్ రిజర్వు స్థలాలను విద్యుత్ శాఖ ఏడీఈ సునీల్‌కుమార్‌తో కలసి టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉచ్చి భువనేశ్వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ ఇండోర్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించారన్నారు. దీనికి అనుగుణం గా స్థలాల పరిశీలన చేపడుతున్నామని వెల్లడించారు. ఇది ఏర్పాటైతే కరెంటు కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పసుపులేటి మల్లికార్జున, సుభాన్‌బాషా, యలమందలరెడ్డి, శేషయ్య నాయుడు, జలదంకి రమేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మనుబోలును వీడని వర్షం

మనుబోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా వర్షం వీడకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సోమవారం ఈదురుగాలుల ధాటికి కాగితాలపూరు గ్రామంలో గడ్డం విమలమ్మకు చెందిన రేకుల ఇల్లు దెబ్బతింది. దీంతో రూ. లక్ష మేర ఆస్తినష్టం వాటిల్లిందని వాపోయింది. గ్రామ విఆర్‌వో సుకుమార్ ఇంటిని పరిశీ లించి వివరాలు నమోదు చేసుకున్నారు. చెరువులు నిండుకుంటున్నాయి. దీంతో చెరువుకట్టలు తెగిపోతాయోమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బ్యాంకు లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు2:(ఆంధ్రజ్యోతి): బ్యాంకు లావాదేవీల్లో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) మేనేజరు సురేష్ తెలిపారు. సోమవారం ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో జొన్నవాడలో జరిగిన ఖాతాదారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు వ్యవహారాల్లో ప్రజల అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని పలువురు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ట్రీస్ సంస్థ కార్యదర్శి ఎస్‌కే. అహమ్మద్‌బాష, సంస్థ సలహాదారు ఎస్‌కే. నౌరజ్ తదితరులు మాట్లా డారు. కార్యక్రమంలో టీ వెంకటేశ్వర్లు, సంఘ బంధం అధ్యక్షురాలు కామేశ్వరి, కోశాధికారు లు కృష్ణవేణి, శైలజ, పొదుపు లీడర్లు, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

భార్య అలిగి వెళ్లిందని భర్త ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు2:(ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి వివరాల మేరకు, మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామానికి చెందిన షేక్ ఖాజా (22) భార్య జుబేదా అలిగి పుట్టింటికి వెళ్లిందని, మనస్తాపంతో సోమవారం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఖాజా స్నేహితుడు రహమతుల్లా వెంటనే అతన్ని బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రాపూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్జీలను స్వీకరించారు.

గిరిజన బాలసంస్కార్ కేంద్రానికి రూ.50వేల విరాళం



చెక్కు అందజేస్తున్న దాత డాక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జయభారత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన బాలసంస్కార్ కేంద్రానికి దాత నగరానికి చెందిన డాక్టర్ కోటేశ్వరరావు రూ. 50 వేల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును సోమవారం సింహపురి ఆసుపత్రిలో ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ గూడూరు మండలం గిరిజన కాలనీలో నిర్వహిస్తున్న బాలసంస్కార్ కేంద్ర నిర్వాహణకు ఈ విరాళం అందించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 73 అమలు చేయండి : సీపీఎం



నెల్లూరు రూరల్ : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో ఆకలి కేకలతో కనీస జరుగుబాటు లేక అవస్థలు పడుతున్న వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లు పెంచేవిధంగా అమల్లోకి తీసుకువచ్చిన జీవో నెం.73ను అమలు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ ప్రస్తుతం రబీ వ్యవసాయ సీజన్ జిల్లా అంతటా మొదలయ్యాయన్నారు. ఈ సమయంలో జీవోను అమల్లోకి తీసుకువస్తే అనేక రైతు కూలీ కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతుందన్నారు. వెంటనే గ్రామాల్లో ఈ జీవోను కార్యరూపంలోకి తీసుకురావాలన్నారు. బెంగాల్, బీహార్ రాష్ట్రాల నుంచి భారీగా వ్యవసాయ కూలీలు వచ్చినందున స్థానికంగా ఉండే కూలీలకు ఉపాధి దూరమవుతుందన్నారు. దీనిని కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపతి వెంకయ్య, పాదర్తి మస్తానయ్య, దారా శివయ్య పాల్గొన్నారు.

సీపీఎం నిరసన


తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు కూలీ పెంచేందుకు జీవో నెంబరు 73ను వెంటనే అమలు చేయాలని తోటపల్లిగూడూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ డిప్యూటీ తహసీల్దారు శివయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం జీవో నెంబరు 73ను విడుదల చేసినా రాష్ట్రంలో అమలు కావడంలేదని తెలిపారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు రవణమ్మ, మధు, బండి సౌరీ, వేగూరి వెంకయ్య, వరిగొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



టీపీగూడూరు : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొనసాగుతున్న మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వేదాయపాలెంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి కేరళ సాంప్రదాయ కార్తీకమాస మండల పూజలు సోమవారం కూడా కొనసాగాయి. ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషేకం, ఉచ్చపూజ, శ్రీవేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతిసేవా, అత్తాళ్ల పూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావాళ్ల ప్రసాద్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



గజలక్ష్మి నమోస్తుతే!

సోమవారం రాత్రి 7 గంటల నుంచి గజవాహనసేవ నయనానందకరంగా సాగింది. బంగారుకాసుల హారాన్ని ధరించిన అమ్మవారు గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది గజవాహనం. ఐశ్వర్యానికి ప్రతిరూపమైన గజవాహనంపైన కొలువుదీరిన అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తజన హృదయాలను రంజింపచేశారు. కీలుగుర్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజవాహనసేవ మాడవీధుల్లో సాగింది.

నేడు స్వర్ణ రథోత్సవం, గరుడోత్సవం

మంగళవారం అమ్మవారి స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4.20 నుంచి 5.20 గంటల మధ్య అమ్మవారు స్వర్ణరథంపై కొలువుదీరి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. అలాగే రాత్రి అమ్మవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శ్రీవారి పాదాలను అమ్మవారికి అలంకరిస్తారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



వరద నష్టం

వరద ప్రభావానికి గురైన గ్రామాలు: 240
దెబ్బతిన్న ఆర్‌అండ్‌బి రోడ్లు: 6 (120కి.మీ.)
దెబ్బతిన్న పంచాయతీ రోడ్లు: 8 (34.72కి.మీ.)
కూలిన కరెంటు స్తంభాలు: 198
తక్షణ మరమ్మతులకు అవసరమైనది: రూ. 367 లక్షలు
శాశ్వత మరమ్మతులకు: రూ.1346 కోట్లు

పొంచివున్న వరద ముప్పు

- వాన తగ్గినా పెరిగిన ప్రవాహాలు
- పొంగిన ఉప్పుటేరు, రొయ్యల కాలువ, బకింగ్ హామ్
- పలు మార్గాల్లో ఆగిన రాకపోకలు
- ప్రమాదకర స్థితిలో స్వర్ణముఖి కరకట్ట
- రిజర్వాయర్లలోకి చేరుతున్న వర్షపు నీరు
- 10,200 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



దొరవారిసత్రం మండలం ఉచ్చూరులో ఇసుక మేటతో పాటు నీటిలో ఉన్న వరి పొలం

ఫెంగల్ తుఫాను బలహీనపడి వానలు తగ్గినా జిల్లాలో వాగులు, వంకల ప్రవాహాలు మాత్రం తగ్గలేదు. ఉరకలెత్తి ఉధృతంగా పారుతున్నాయి. పలుచోట్ల రోడ్లను అడ్డగిస్తున్నాయి. రాకపోకలకు అవరోధం కలిగిస్తున్నాయి. స్వర్ణముఖి, కాళంగి, అరణియార్‌లు జలకళలాడుతున్నాయి. మరో వైపు ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయి. వాన జోరు పెరిగితే మాత్రం ముప్పు అంచున ఉన్న అనేక గ్రామాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉధృతంగా బకింగ్ హామ్



కోట మండలం గోవిందపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బకింగ్‌హామ్ కెనాల్

కోట మండలంలో సోమవారం బకింగ్ హామ్ కెనాల్ ఉధృతి పెరిగింది. దీంతో గోవిందపల్లి, గోవిందపల్లి పాలెం గ్రామాల నడుమ రాకపోకలు స్తంభించాయి. చిల్లకూరు మండలంలో భారీ వర్షాలకు సోమవారం సాయంత్రం ఉప్పుటేరు పొంగింది. తిప్పగుంట పాలెం చప్టాపై నీటి ప్రవాహం పెరగడంతో వంద కుటుంబాలు చిక్కుకుపోయాయి. చిట్టమూరు మండలంలో సోమవారం కూడా మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజుల వర్షానికి సోమవారం రొయ్యల కాలువ ఒక్కసారిగా పొంగింది. దీంతో మల్లాం-కొత్తగుంట నడుమ రాకపోకలు ఆగిపోయాయి.

ప్రమాదంలో స్వర్ణముఖి కరకట్ట

బ్యారేజీ నుంచీ దిగువకు నీటి ప్రవాహం ఉధృతంగా సాగుతున్న కారణంగా సోమవారం కోట మండలం దైవాల దిబ్బ వద్ద స్వర్ణముఖి నది కరకట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. కరకట్ట తెగిపోతే కోట మండలంలోని పుచ్చలపల్లి, దైవాల దిబ్బ గ్రామాలతో పాటు వాకాడు మండలం గంగనపాలెం గ్రామాలు నీట మునిగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కోట మండల తహసిల్దారు పది ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించినా ఉపయోగం లేకపోయింది. ఇరిగేషన్ అధికారులు సరిగా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు.



కోట మండలం దైవాలదిబ్బ వద్ద దెబ్బతిన్న స్వర్ణముఖి కరకట్ట

వాకాడు మండలంలో 12 గ్రామాలకు ముప్పు




వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి నీటి ఉధృతి

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి ఆదివారం 18 వేల క్యూసెక్కుల నీరు చేరగా, సోమవారం 15 వేల క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజీ పూర్తిగా నిండిపోయి వున్నందున వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలిపెట్టేస్తున్నారు. ఇక గంగన పాలెం-బాలిరెడ్డిపాలెం నడుమ వంతెనపైకి నీరు చేరడంతో 12 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. మరో రెండు రోజుల పాటు పరిస్థితి ఇలాగే వుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా వంతెన వద్ద ఇరువైపులా కోతకు గురి కాకుండా భారీగా ఇసుక బస్తాలు పేర్చారు.

మల్లిమడుగులో పది గేట్లు ఎత్తేశారు

రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్‌కు కూడా వరద నీరు భారీగానే చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవడంతో ఇన్‌ఫ్లో 2 వేల క్యూసెక్కులుండగా అంతకంటే ఎక్కువగా 2100 క్యూసెక్కుల నీటిని పది గేట్లు ఎత్తివేసి దిగువకు విడుదల చేస్తున్నారు.

కళ్యాణి డ్యాంలోకి నీరు



కళ్యాణి డ్యామ్‌లోకి మొదలైన నీటి చేరిక

జిల్లాలో దాదాపుగా అన్ని రిజర్వాయర్లలోకి వర్షపు నీరు చేరుతోంది. కళ్యాణి డ్యామ్‌లోకి శేషాచల అడవుల నుంచీ నుంచీ నీరు వస్తోంది. చంద్రగిరి మండలంలోని ఈ డ్యామ్ లోతు 910 అడుగులు కాగా ఆదివారం వరకూ 841 అడుగుల వరకూ వున్న నీటి మట్టం వర్షపు నీటి ప్రవాహం మొదలు కావడంతో సోమవారం 853 అడుగులకు చేరింది.

నిండుకుండలా అరణియార్

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. జిల్లాలోనే అతి పెద్ద రిజర్వాయర్ అయిన అరణియార్ నీటి నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీలు. ఇపుడు అందులో 1.74 టీఎంసీల నీరు చేరింది. 31 అడుగుల లోతు కలిగిన రిజర్వాయర్‌లో ఇప్పటికే 29.5 అడుగుల ఎత్తున నీరు చేరింది. రిజర్వాయర్‌లోకి 4 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఒక గేటు తెరిచి వెయ్యి క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం మండలంలో భారీ వర్షం కురవడంతో రాత్రికే రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉరకలెత్తుతున్న కాళంగి

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ మొత్తం నీటి మట్టం 240 అడుగులకు గానూ సోమవారం సాయంత్రానికి 219 అడుగులకు నీరు చేరింది. 2830 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తుండగా మొత్తం 18 గేట్లకు గానూ ఆరు గేట్లు ఎత్తి 2260 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలిపెడుతున్నారు.

దెబ్బతిన్న పంటలు



దొరవారిసత్రం మండలం కొత్తపల్లిలో ఇసుక మేట వేసిన వేరుశనగ పొలం (ఇన్‌సెట్‌లో) ఆనేపూడిలో మొలకెత్తిన వేరుశనగ

జిల్లావ్యాప్తంగా ఫెంగల్ తుఫాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచీ కురిసిన వర్షాలకు పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనా మేరకు మొత్తం 10,200 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలకు నష్టం జరిగింది. రబీ సీజను ప్రారంభం కావడంతో ప్రధానంగా నారు దశలో ఉన్న వరి పంట నీట మునిగింది. వేరుశనగదీ అదే పరిస్థితి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి 4338 మంది రైతులు నష్టపోయారు. సూళ్లూరుపేట, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకొన్నారు. ఇక, తుఫాను వల్ల ఒక ఎద్దు, ఒక ఆవు, నాలుగు దూడలు, నాలుగు గొర్రెలు మృతిచెందాయి. రెండు పక్కా ఇళ్ళు పాక్షికంగా దెబ్బతినగా మరో నాలుగు గుడిసెలు నేలమట్టమయ్యాయి.



పడమటి కండ్రిగ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, ఏవో కవిత, రైతులు

154 కి.మీ.ల మేర 14 రోడ్లు ధ్వంసం

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 34.72 కిలోమీటర్ల మేర ఎనిమిది రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.31 లక్షలు, శాశ్వత రిపేర్లకు రూ.3.15 కోట్లు అవసరమని ఆ శాఖ అంచనా వేసింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో 120 కిలోమీటర్ల మేర ఆరు రోడ్లు పాడయ్యాయి. రోడ్ల ఉపరితం కొట్టుకుపోగా మరమ్మతులకు రూ.2 కోట్లు.. తాత్కాలిక రిపేర్లకు రూ. 60 లక్షలు.. శాశ్వత మరమ్మతులకు రూ.1342 కోట్లు అవసరమని ఆ శాఖ అధికారులు నివేదించారు.

విద్యుత్ శాఖకు రూ. కోటి నష్టం

ఎస్పీడీసీఎల్‌కు సంబంధించి 198 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, 90 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 30 కిలోమీటర్ల మేర 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ తీగలు తెగిపోయాయి. మొత్తం సుమారు రూ. కోటి వరకు నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

తక్షణ అవసరం రూ.3.66 కోట్లు

ఫెంగల్ తుపానుతో జరిగిన నష్టం అంచనా వేయడంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ప్రాథమిక సేకరించిన సమాచారం మేరకు జిల్లాలో 240 గ్రామాలు తుపాను ప్రభావానికి గురయ్యాయి. పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖలకు కలిగిన నష్టాలకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు రూ.3.66 కోట్లు.. శాశ్వత పనులకు రూ.1346 కోట్లు (గత తుపానులో దెబ్బతిన్నవి కలిపి) కావాలని ప్రతిపాదించారు.

జడివాన

- ఓజిలిలో అత్యధికంగా 35.4 మి.మీ వర్షపాతం

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా.. ఓజిలి 35.4, పిచ్చాటూరు 21.2, రామచంద్రాపురం 20.8, తిరుపతి రూరల్ 18.4, రేణిగుంట 15.6, చంద్రగిరి 14, శ్రీకాళహస్తి 13.2, దక్కిలి 12.6, తిరుపతి అర్బన్ 12.4, తొట్టంబేడు 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

స్థానికులకు శ్రీవారి దర్శనం

- తిరుపతి, తిరుమలలో టోకెన్ల జారీ
- 3000 కోటాకు 2903 తీసుకున్న భక్తులు
- వైకుంఠ దర్శనాలకోసం తిరుమలలో 97 మంది వెనకడుగు



- 6లో

ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో 'అన్యమత' కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ
- కారుపై దాడి
- అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ మహిళా ప్రొఫెసర్ కూడా ఫిర్యాదు



- వివరాలు 6లో

త్రుటిలో తప్పిన ప్రమాదం

- వాగులో కొట్టుకు పోతున్న ఉపాధ్యాయుడిని రక్షించిన స్థానికులు



ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. రత్నకుమార్ రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. విధులకు హాజరుకావడానికి ఉదయం 7.30గంటలకు గోవిందవరం నుంచి రాజులకండ్రిగకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో దారిలో స్వర్ణముఖి వంక ఉంది. దాన్ని దాటుతుండగా అదుపు తప్పి కొద్ది దూరం కొట్టుకుపోయారు. దీనిని గుర్తించిన స్థానికులు సకాలంలో రత్నకుమార్‌ను ఒడ్డుకు చేర్చారు.

ఆర్టీసీకి రూ.80లక్షలు తగ్గిన రాబడి

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల్లో ఆర్టీసీకి దాదాపు రూ.80లక్షల రాబడి తగ్గినట్లు అధికారులు అంచనా వేశారు. వాగులు, వంకలు ప్రవహించడం, కల్వర్టులపై నీరుచేరడం, రోడ్లు కొట్టుకుపోవడం, ప్రయాణికుల రద్దీ లేకపోవడం వంటి కారణాలతో 25మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు ఆగిపోయాయి. 30వేల కిలోమీటర్లు రవాణా స్తంభించింది. రెండు రోజులుగా దాదాపు 40బస్సులు డిపోలకే పరిమితయ్యాయి. కొన్ని ఇతర మార్గాలకు దారి మళ్లించి నడిపినా పెద్ద ప్రయోజనం లేదు. వారాంతంలో బెంగళూరుకు, హైదరాబాదుకు నడిచే అదనపు బస్సులు కూడా ఆగిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి యథావిధిగా బస్సులు నడపాలని డ్రైవర్లు, కండక్టర్లను అధికారులు ఆదేశించారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ ఐజీ విజయ్‌భాస్కర్

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ విజయ్‌భాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆరోపణలు రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఏజీ తెలిపారు. మండల పరిధిలో ప్రభుత్వ, వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటి ఆధారంగా అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి కార్యాలయానికి త్వరలోనే సీనియర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూస్తామన్నారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.





పల్లకిపై జనని.. పులకించిన అవని

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు సోమవారం అత్యంతం వైభవంగా సాగాయి. కమ్ముకున్న కారుమబ్బులూ.. ఉండి ఉండీ కురుస్తున్న వానజల్లుల నడుమ మాడవీధులు కళాబృందాల ప్రదర్శనలతో హోరెత్తాయి. లక్ష్మీకాసుల హారం ఊరేగింపు, వసంతోత్సవం సోమవారం విశేషంగా సాగాయి.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మోహినీ రూపి

వాలుజడ వయ్యారం.. అర్ధనిమీలిత నేత్రాలు.. చిరుమందహాసం.. పున్నమి జాబిల్లిని మించి న ముఖారవిందంతో పద్మావతి అమ్మ మోహిని అవతారంలో పల్లకిలో ఊరేగారు. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల దాకా మాడవీధుల్లో కిక్కిరిసిన భక్తజనసందోహం నడుమ పల్లకిసేవ సాగింది.



గంధము పుయ్యరుగ...

అమ్మవారికి గజవాహనం రోజున వసంతోత్సవం (చందనోత్సవం) వేడుకగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం పద్మావతమ్మను ఆలయ ప్రదక్షిణగా సన్నిధి మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ కమల తిరుచ్చిపై అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ.. చిరుజల్లుల నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు.

నేడు గరుడవాహనం

- ఉదయం 8 గంటలకు : సర్వభూపాల వాహనం
- సాయంత్రం 4.20 : స్వర్ణరథోత్సవం
- రాత్రి 7 : గరుడవాహనం



దేవేరికి శ్రీవారి లక్ష్మీకాసుల హారం

గజవాహనమెక్కి ఊరేగే దేవేరి కోసం సోమవారం తిరుమల శ్రీనివాసుడు తన సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని పంపారు. పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే ఈ హారాన్ని గజవాహన సేవలో అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. ఉదయం తిరుమల ఆలయంలో లక్ష్మీకాసుల హారాన్ని శ్రీవారిపాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల మాడవీధుల్లో ఊరేగించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుచానూరుకు తీసుకువచ్చారు. తిరుచానూరు పసుపు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర మాడవీధుల నుంచి అమ్మవారి ఆలయం వరకు వేడుకగా సాగింది. హారాన్ని అమ్మవారి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజవాహనసేవలో అమ్మవారికి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు పాల్గొన్నారు.

ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఆర్డీవో ఈ.కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రజలు తిరుపతి జిల్లా కేంద్రానికి రావడానికి దాదాపు 3 గంటలకు పైగా సమయం పడుతుందన్నారు. పేదలు అంతదూరం రాలేరని, జిల్లా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపామన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్ నిర్వహించి అర్జీలు స్వీకరించామన్నారు. ఇకపై ప్రతి రెండు వారాలకోసారి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని ఎంచుకొని పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 164 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ, డ్రైనేజీ, తాగునీరు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎంపీడీవో ప్రమీలా రాణి, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, పీఆర్ డీఈ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థానికుల్లో ఆనందం

- నేటి శ్రీవారి దర్శనానికి టోకెన్ల జారీ

తిరుపతి/తిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్లను సోమవారం జారీ చేయడంతో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. స్థానికులకు తొలిసారిగా 2013లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా మొదటి మంగళవారం 5వేల టోకెన్లు చొప్పున ఇస్తూ వచ్చారు. 2019లో జగన్ సీఎం కాగానే స్థానికుల దర్శనానికి మంగళం పాడారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయినా స్థానికుల దర్శనం పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో కూటమితరఫున పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల హామీగా స్థానికులకు శ్రీవారి దర్శనం అంశాన్ని తీసుకొచ్చారు. ఈక్రమంలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక.. తొలి సమావేశంలోనే స్థానికుల దర్శనాన్ని పునరుద్ధరించింది. గతంలో తిరుమల, తిరుపతి వారికే ఉండగా.. ఇప్పుడు చంద్రగిరి, రేణిగుంట మండలాలనూ కలిపారు. మంగళవారం నాటి దర్శనానికి సోమవారం ఉదయం తిరుపతిలోని మహతిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి కలిసి కొంతమంది స్థానికులకు స్వయంగా టోకెన్లు జారీ చేశారు. వేకువజాము 4నుంచి ఉదయం 11.30 గంటలకే 2500 టోకెన్లు పూర్తయ్యాయి. తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 7.30 గంటలకు టోకెన్ల జారీని ప్రారంభించారు. ఈ టోకెన్లు పొందిన వారికి.. తిరిగి మూడు నెలల తర్వాతే అవకాశం ఉంటుంది. దీంతో వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్లు రావనే భయంతో కొందరు వెనకడుగు వేశారు. దీంతో తిరుమలలో 500 టోకెన్లు స్థానికుల కోసం కేటాయించినా.. 403 మాత్రమే తీసుకోగా 97 మిగిలిపోయాయి. ఈ టోకెన్లు తీసుకున్న వారు మంగళవారం ఉదయం ఒరిజినల్ ఆధార్ కార్డులతో.. ఆయా టైం స్లాట్ల ప్రకారం దివ్యదర్శనం క్యూలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.



తిరుమలలో టోకెన్లు పొందిన స్థానికులు

ఇదో గొప్ప అవకాశం

తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు ఇదో గొప్ప అవకాశమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తొలిబోర్డులోనే తీసుకున్న నిర్ణయాన్ని ఎంతో కష్టపడి ఇంత త్వరగా అమలు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనానికి ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికుల దర్శనానికి ప్రణాళికలు రూపొందించుకున్నామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లకు, స్థానికుల దర్శన టోకెన్లకు సంబంధించి త్వరలోనే స్పష్టత ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానికుల కోటాలో తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సాధారణ దర్శనాలే కాకుండా ఆర్జిత సేవల్లోనూ ప్రత్యేక కోటా ఇవ్వాలని కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. గతంలో ఉన్న 5వేల టోకెన్లు మూడు వేలకు కుదించడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తిరుమల శ్రీవారికి, స్థానికులకు ఉన్న అనుబంధాన్ని విడగొట్టిన వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, వరప్రసాద్, రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, కూరపాటి సురేష్, మునస్వామి, యాదవకృష్ణ పాల్గొన్నారు.



తిరుపతిలో టోకెన్ల కోసం క్యూలో వెళుతున్న స్థానికులు



ప్రొఫెసర్ చెంగయ్య కారుపై దాడి చేసిన దృశ్యం -



ఉద్యోగులు, విద్యార్థుల వాట్సప్ గ్రూపులో అన్యమత ప్రచారం

ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో 'అన్యమత' కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం అన్యమత ప్రచారంపై కలకలం రేగింది. ఈఈఈ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య మత ప్రచారం చేస్తున్నారంటూ భజరంగ్‌దళ్, ఏబీవీపీ ఆరోపించాయి. యూనివర్సిటీ, కాలేజీ జారీ చేసే సర్క్యులర్‌పైన 'ప్రైజ్ ద లార్డ్' అని రాయడాన్ని వారు తప్పుపట్టారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భజరంగ్‌దళ్ నాయకులు విష్ణు ప్రతీక్ రెడ్డి, కిరీటి, ఏబీవీపీ నాయకులు పూజారి రాఘవేంద్ర, సురేంద్ర తదితరులు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రొఫెసర్ చెంగయ్య చాంబరులోకి వెళ్లి వర్సిటీలో మత ప్రచారం ఎలా చేస్తారంటూ నిలదీశారు. ఆయన్ను చొక్కా పట్టుకొని బయటకు తీసుకొచ్చిన వారు.. ఇటుకలతో కారుపై దాడి చేశారు. అనంతరం వారు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, హెడ్ రూములో కుర్చీ వెనుక గల వేంకటేశ్వర స్వామి పటాన్ని తొలగించారని, స్టూడెంట్స్, ఎంప్లాయీస్ ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో ఏసు స్తోత్రాలు, వీడియోలు పంపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై ఫిర్యాదులు వచ్చాయి.

మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుతో కమిటీ

కాగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మత వివక్ష చూపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై మహిళా ప్రొఫెసర్ ఉషారెడ్డి వీసీ, రిజిస్ట్రార్‌కు మౌఖిక ఫిర్యాదు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా ఫిర్యాదు వస్తేనే తాము పరిశీలిస్తామని వారు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు ఆమె ఫిర్యాదు చేశారు. వృత్తి పరమైన వేధింపులకు గురి చేస్తున్నారనీ, రాత్రి దాకా తమను విభాగంలోనే ఉండేలా చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు నేతృత్వంలో ఐదుగురు మహిళా ప్రొఫెసర్లతో ఆయన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. లేడీ ఫ్యాకల్టీతో పాటు ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులందరిని ఈ కమిటీ విచారిస్తుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కాలేజీ కౌన్సిల్‌లోనూ దీనిపై చర్చించామని, విచారణలో భాగంగా ప్రొఫెసర్ చెంగయ్యను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

14 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్ట్

రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్ల స్వాధీనం

మంగళం/ఏర్పేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం ఆదివారం రాత్రి కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్‌లో ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. చింతపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలేరో గూడ్స్ వాహనాల్లో కొంతమంది అనుమానాస్పదంగా దిగుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టుముట్టి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా పిడిలేని ఇనుప బరిసెలు, గొడ్డళ్లు, రంపపు చుట్ట వంట సామగ్రి దొరికాయి. పట్టుబడ్డ వారిలో 13 మంది తమిళనాడుకు చెందిన వారు కాగా ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుపడ్డ స్మగ్లర్లను, వాహనాలను, గొడ్డళ్లు, రంపాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చెవిరెడ్డి చేసింది తప్పుకాదా?

దీనిపై ప్రతిఒక్కరూ ఆలోచించండి ● బాలిక తండ్రి గొంతు నొక్కేసినా సాక్ష్యాలు ఉన్నాయన్న ఎమ్మెల్యే నాని

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నమ్మి వైసీపీ నేతలు పదేపదే మోసపోతుంటారు. ఎర్రావారిపాలేనికి చెందిన బాలిక తండ్రిని నేనెప్పుడూ విమర్శించను. గతంలో ఆయన ఏమి మాట్లాడారో, ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నాడో ప్రజలందరికీ తెలుసు. చెవిరెడ్డి చేసింది తప్పు కాదా? అని మాత్రమే ఆలోచించండి. మనకి కూడా ఆడబిడ్డలు ఉన్నారు. మీవిజ్ఞతకే వదిలేస్తున్నా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద ఘటనపై బాలిక తండ్రితో కలిసి వైసీపీ నేతలు భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడిన వ్యవహారంపై సోమవారం నాని స్పందించారు. యల్లమంద ఘటన సమయంలో రమణతో కలసి ఆయన కోడలు మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. ఫిర్యాదుదారుల గొంతు నొక్కేస్తే సుమోటాగా కూడా తీసుకునే అవకాశం పోక్సో కేసులకు ఉందన్న విషయం వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా చెవిరెడ్డిపై పోరాటం చేస్తున్నానని, భూమనకు శిష్యుడనని చెప్పుకునే చెవిరెడ్డి ఆయన పట్ల ఎలా నడుచుకుంటున్నారో కూడా అందరికీ తెలుసన్నారు. పోలీసులు కక్షసాధింపుగా కేసులు పెడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనవసరంగా 37 మంది టీడీపీ నాయకులపై చెవిరెడ్డి కేసులు పెట్టించారని గుర్తుచేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందా? లేదా? అని మాత్రమే ఆలోచించాలన్నారు. సాక్ష్యాలు అనేవి ఖచ్చితంగా ఉంటాయని, న్యాయవ్యవస్థ ఎవరికి అన్యాయం జరిగిందో వారిని కాపాడితీరుతుందన్నారు. గత ఐదేళ్లలో తిరుపతి రూరల్లో అభివృద్ధి ఆగిపోయిందని, ఇప్పుడు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు గుండెలపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారన్నారు.

నాణ్యమైన మద్యం కాదు.. విద్యనందించాలి

- సీపీఎం జిల్లా సభల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

సత్యవేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కావాల్సింది నాణ్యమైన మద్యం కాదని.. నాణ్యమైన విద్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ జిల్లా సభల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని స్మార్ట్‌సిటీగా చేస్తామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రారంభమైన సోమశిల- స్వర్ణముఖి లింకు కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. అదానీ సోలార్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధికి 28 అంశాలతో కూడిన తీర్మానాలను సభలో ఆమోదించారు. నాయకులు రమేష్, గంధం మణి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నాగరాజు



జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, సభ్యులుగా భగత్, సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య వ్యవహరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. రూ.3.33 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది.

విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల విద్యాభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక బనిగిసాహెబ్ పేటలో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేదల విదాభివృద్ధి కోసం ఎన్నో పథకాలను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబుతో చర్చించి గూడూరులో బీసీ బాలికల గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేశామన్నారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, వాటంబేటు శివకుమార్, పురుషోత్తం రెడ్డి, అబ్దుల్ రహీం, ఇజ్రాయెల్‌కుమార్, తూపిలి సురేంద్ర, మట్టం శ్రావణి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలను పరిష్కరించండి



డీటీ యువరాజుకు సమస్యలు వివరిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జరిగిన భూముల రీసర్వేతో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఏకపక్షంగా జరిగిన రీసర్వేలో ఒకరి భూమి మరొకరి పేరున, జాయింట్ ఎల్‌పీఎంలు, విస్తీర్ణం తగ్గుదల, మ్యుటేషన్ ఇబ్బందుల వల్ల రైతులకు 1బీ, అడంగల్ రావడం లేదన్నారు. 1బీ లేకపోవడంతో బ్యాంకుల్లో పాత రుణాలు రెన్యువల్ కాకపోగా, కొత్త రుణాలు మంజూరు కావడంలేదని డీటీ దృష్టికి తీసుకెళ్లారు. లోపాలు సరిచేయాలని రీసర్వే గ్రామసభల్లో అందించిన అర్జీలను రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. గత ఎన్నికల ముందు నుంచి వందల సంఖ్యలో రైతులు మ్యుటేషన్, పట్టదారు పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకూ పాసుపుస్తకం అందలేదన్నారు. అధికారులు స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, ఎం.మురళీ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా బురదమయం



బుడద రోడ్డులో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు జగనన్న కాలనీలో రోడ్డు బుడదమయంగా మారుడంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలో మౌలిక వసతి కల్పించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే దారంతా బురదమయంగా మారి నడవడానికి కూడా అగచాట్లు పడాల్సిన వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 2: మున్సిపాలిటీలోని ఎన్‌జేఆర్ సర్కిల్ వద్ద అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిణి సాయిలీల, సర్వేయర్ సుబ్రహ్మణ్యం సోమవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అక్రమ కట్టాలను కూల్చివేయాలని కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మున్సిపాలిటీలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు పాటిమిట్ట ప్రాంతానికి చెందిన శీనమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిమిత్తం జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం కార్యవర్గ సభ్యుడు మదిర బాలయ్య, శేషగిరి, సునీల్, వెంకటేశ్వర్లు, రమణయ్య, బాలగురవయ్య, మోహన్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సమావేశాన్ని విజయవంతం చేయండి

గూడూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మందిర్‌లో రిహాబిలిటేషన్, ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న దివ్యాంగుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంస్థ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక రెడ్ సంస్థ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులు దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెడ్ సంస్థ ప్రతి నెలా దివ్యాంగులకు నిత్యావసరసరాలను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో జాన సుధీర్, రాజేష్, శీనువాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతును ముంచిన ఫెంగల్

- పేట సబ్‌డివిజన్‌లో తీవ్ర నష్టం
- 3725 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

దొరవారిసత్రం, సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు రైతాంగానికి తీవ్ర నష్టం చేకూర్చాయి. ప్రధానంగా వరి సాగు చేసిన రైతులు నష్టపోయారు. లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాల్లో వరద నీరు ఇప్పటికీ తగ్గుముఖం పట్టలేదు. వర్షాలతో పాటు, కాళంగికి వరద పోటెత్తడంతో నది పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. పంటలు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయి. ప్రధానంగా కాలువలు నెర్రికాలువ, కన్నాకాలువ, పాల కాలువ, పాములకాలువ, పుచ్చకాలువల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 3725 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా. దొరవారిసత్రం మండలంలో 1480, సూళ్లూరుపేటలో 1317, తడలో 927 ఎకరాలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దొరవారిసత్రం మండలంలో కన్నాకాలువ వరద తాకిడికి కట్టువపల్లి, పూలతోట, చవటకండ్రిగ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే ఆనెగొట్టం, కరటాముడి, తొగరాముడి, అక్కరపాక లోతట్టు ప్రాంతాల్లో వరి నీటిలో కుళ్లుతోంది. కాళంగి పరివాహక తాకిడికి దొరవారిసత్రం మండలంలో వెదురుపట్టు, ఉచ్చూరు, కుప్పారెడ్డిపాళెం, తల్లంపాడు పంచాయతీలతో పాటు, సూళ్లూరుపేట మండలంలో పడమటికండ్రిగ, ఎన్‌వీకండ్రిగ, తడలో కాదలూరు, కొండూరు, వాటంబేడు, గొల్లలమల్లు ప్రాంతాల్లో వరి పంటలు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయి. అలాగే పులికాట్ పరివాహక ప్రాంతాల్లోనూ వరి పంటలు దెబ్బతిన్నాయి.



సూళ్లూరుపేట మండలం ఎన్‌వీ కండ్రిగలో నీట మునిగిన వరి పంట

వేరుశనగ, మిరప రైతులకు స్వల్ప నష్టం

సూళ్లూరుపేట సబ్ డివిజన్‌లో మిరప, వేరుశనగ సాగు చేసిన రైతులకు వాటిల్లిన నష్టం స్వల్పమేనని అధికారులు చెబుతున్నారు. 15 హెక్టార్లలో మిరప, 10 హెక్టార్లలో వేరుశనగ నష్ట పోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వాస్తవానికి మరో వారం రోజుల తరువాత సూళ్లూరుపేట ప్రాంతంలో మిరప, వేరుశనగ సాగు విస్తారంగా ఉంటుంది. ప్రస్తుత వర్షానికి ముందుస్తుగా పంటలు వేసిన రైతులు నష్ట పోయారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగిన పంటపొలాలను సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ కళాశాల, పడమటి కండ్రిగ ప్రాంతాల్లో కాళంగి, పాముల కాలువ వరద ప్రవాహానికి నీట మునిగిన పొలాలను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తడ, సూళ్లూరుపేట, వరదయ్యపాలెం ప్రాంతాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయ్యిందన్నారు. దీంతో పంట పొలాలు నీట మునిగాయని, పలుచోట్ల రోడ్లు, చెరువులు దెబ్బతిన్నాయన్నారు. నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేస్తామని చెప్పారు. తెగిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. పంట నష్టానాకా సంబంధించిన వివరాలతో నివేదిక రూపొందించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం కాళంగి, పాముల కాలువ నీటి ప్రవాహం కలిసే రైల్వే ట్రాక్ బిడ్జి పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కిరణ్మయి, తెలుగుగంగ ఎస్‌ఈ మదన గోపాల్, వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత, ఏవో కవిత తదితరులు ఉన్నారు.

యాకసిరి చెరువుకు గండి



యాకసిరి చెరువు కట్టకు ఇసుక బస్తాలు వేస్తున్న అధికారులు

చిట్టమూరు, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వరి పంటలు నీట మునిగాయి. ఆదివారం రాత్రి రొయ్యల కాలువకు నీటి ఉధృతి పెరగడంతో చుట్టు పక్కల వరి పంటలు నీట మునిపోయాయి. కొత్తగుంట, మల్లాం మార్గంలోని బాలచంద్రారెడ్డి ఎస్టేట్ వద్ద ఉన్న చప్టా వద్ద పోలీసులను కాపలా ఉంచి ఆ మార్గంలో రాకపోకలను ఆపేశారు. మండలంలోని యాకసిరి మేజర్ చెరువుకు గండి పడడంతో ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దారు ప్రసాద్, ఎస్ఐ చిన్న బలరామయ్య రైతులతో కలిసి ఇసుక బస్తాలు వేసి రింగ్ బండ్ వేశారు.

పూడేరు గ్రామదేవత ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఉయ్యాలమ్మ ఆలయం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడేరు గ్రామంలో గ్రామదేవత ఉయ్యాలమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం గ్రామస్తులు అమ్మవారిని నగలతో అలంకరించి పొంగళ్లు పెట్టారు. సాయంత్రం దీపాలు వెలిగించి తాళాలు వేసుకొని వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆలయం తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. అమ్మవారికి అలంకరించిన 4 సవర్ల బంగారు ఆభరణాలు, హుండీలో నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నాయుడుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళలు ఆలయానికి చేరుకొని పిండిదీపాలు వెలిగించారు. అనంతరం స్వర్ణముఖినదిలో దీపాలను మహిళలు వదిలారు.

సగం చెరువులే నిండాయి!

డక్కిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ కారణంగా వర్షాలు కురిసి అన్ని ప్రాంతాల్లో చెరువులు నిండినా డక్కిలి మండలంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మూడు రోజుల నుంచి మబ్బులు కమ్ముకొని జల్లు తప్ప భారీ వర్షం పడలేదు. దీంతో మండలంలో సగం చెరువులు మాత్రమే నిండాయి.

ఓజిలిలో మోస్తరు వర్షం

ఓజిలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం మోస్తరు పడుతూనే ఉంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి పలు చెరువుల్లో నీరు చేరింది.

విద్యార్థిని చదువులకు ఆర్థిసాయం

చిల్లకూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి కరుణ ఉన్నత చదువుల కోసం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బాబు, హెచ్ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం నాయుడు తదితులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు

తిప్పగుంటపాళెం చప్టాపైకి వరదనీరు



తిప్పగుంటపాళెం చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

చిల్లకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం వద్ద ఉన్న ఉప్పుటేరు పొంగి చప్టాపైకి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో చప్టాకు అవతలి వైపు ఉన్న సుమారు వంద కుటుంబాల వరకు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమవారం వర్షం కురవకపోయినప్పటికీ పైప్రాంతాల నుంచి వరద ఉప్పుటేరుకు చేరుకోవడంతో చప్టాపైకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దారు శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఉప్పుటేరును పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ఉప్పుటేరు వద్ద సిబ్బందిని నియమించారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్

గూడూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఆరోగ్యంగా ఉండాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ రహిత సమజాన్ని స్థాపించేందకు అందరం కలిసి కట్టుగా ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకుని వచ్చేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయ మహేష్, ఝాన్సీ, వాణి, నారాయణరాజు, శ్రీధర్ శర్మ, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్న వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా పార్కు సమీపంలో ఆ వృద్ధుడు సంచరిస్తున్నట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ సేవలను విస్తరిస్తాం



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వేణు

కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ సహకారంతో ఏర్పాటైన ఆధార్ కేంద్రం సేవలను విస్తరిస్తామని ఎంపీడీవో వేణు తెలిపారు. సోమవారం ఆయన ఆధార్ కేంద్రంలోని సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా కేవలం గిరిజనులకే కాకుండా గిరిజనేతరులకు కూడా ఉచితంగా ఆధార్ సేవలు అందిస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శిలు కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెంలో టీడీపీ నాయకులు సోమవారం పేదలకు అన్నదానం చేశారు. వట్రపాలెం ముంపునకు గురికావడంతో అక్కడ నివాసం ఉన్న ప్రజలకు తెలుగు యువత ఉపాధ్యక్షుడు పి.మాధవ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, వాకచర్ల రమేష్, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి

ఉప్పొంగిన మామిడి కాలువ, బకింగ్‌హామ్ కెనాల్



మామిడి కాలువ పొంగి రోడ్డుపై వరదనీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్న రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల ప్రజలు

కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో సోమవారం కూడా ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో గూడలి వద్ద ప్రవహిస్తున్న స్వర్ణముఖి పరవళ్లు తొక్కుతోంది. వరద నీరంతా స్వర్ణముఖి నుంచి చల్లకాలువ నదిలోకి ప్రవహిస్తోంది. అదేవిధంగా ఊనుగుంటపాళెం వద్ద మామిడి కాలువ పొంగి చప్టాపైకి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దైవాలదిబ్బ, పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి పొర్లు కట్టలు కోతకు గురై బలహీనంగా ఉండటంతో స్వర్ణముఖి పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోవిందపల్లి వద్ద బకింగ్‌హమ్ కెనాల్‌కు వరద పోటెత్తడంతో చప్టాపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి రాకపోకలు ఆగిపోయాయి.

వరదనీటిలో వట్రపాలెం



గోపాల్‌రెడ్డిపాలెం గిరిజన కాలనీ నివాసాల చుట్టూ వర్షపునీరు

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వట్రపాలెం ప్రాంతానికి చిన్నపాటి వర్షమొచ్చిన ముంపు తప్పడం లేదు. కాళంగికి వదర వస్తే నది అంచునే ఉన్న ఈ ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు వచ్చేస్తుంది. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు సూళ్లూరుపేటలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. కాళంగి నది అంచునే ఉన్న వట్రపాలెం ముంపునకు గురైంది. సోమవారం కూడా ఇళ్లన్నీ నీటి మడుగులోనే ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కారిజాత రోడ్డులో ఉన్న గిరిజన కాలనీలోనూ వరద నీరు తగ్గలేదు.

చేనేతలకు సాయం అందించేందుకు చర్యలు



మగ్గం గుంటలు పరిశీలిస్తున్న వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వర రావు, తెలుగు మహిళ మట్టం శ్రావణి

గూడూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా మగ్గం గుంతల్లో నీరు చేరి ఇబ్బందులకు గురైన చేనేతలకు సాయం అందించేలా చర్యలు చేపడుతామని వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వర రావు అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో మగ్గం గుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో నివేదికలను రూపొందించి ఉన్నతధికారులకు అందజేసి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి మాట్లాడుతూ చెన్నూరు గ్రామంలో 200పైగా మగ్గం గుంతల్లో తుఫాను కారణంగా నీరు చేరడంతో పనులు లేక చేనేతలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన జిల్లా వీవర్స్ అధికారులతో చర్చించి నష్టలను అంచనా వేయాలని, బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో కటికాల శ్రీనివాసులు, రాజనాల, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

9న అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన తిరుపతి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రైమినిస్టర్ నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 9441647174, 9533717170లలో అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ గంగాధరాన్ని సంప్రదించాలని సూచించారు.

6న జిల్లాకు మంత్రి సుభాష్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ నెల 6న జిల్లా పర్యటనకు రానున్నారు. అనంతపురం నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం వివిధ అంశాలపై కలెక్టరేట్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుగు పయనమవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు.